# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శుక్రవారం 25 అక్టోబర్ 2024 | తెలంగాణ ప్రాంతీయం | పేజీలు : 08


## నేడు చింతపల్లిలో మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమం

**చింతపల్లి, అక్టోబర్ 24(నినాదం న్యూస్) :** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో నేడు జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ప్రజలకు అందుబాటులో ఉంటారని స్థానిక ఎస్ఐ భీమనమోని యాదయ్య తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల వద్దకు వెళ్లి పరిష్కరించే దిశగా నేడు పోలీసు స్టేషన్లో ఉదయం 11.00 గంటలకు మీట్ యువర్ యస్పి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.బాధితుల ఫిర్యాదులను పోలీసు స్టేషన్లలోనే పరిశీలించి సత్వర న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని  తెలిపారు. మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను ఎస్పి దృష్టికి స్వయంగా తీసుకువెళ్లి దరఖాస్తులు సమర్పించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## అభివృద్ధి ఫలాలు ప్రతీ ఒక్కరికి అందాలి

- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- జిల్లాలో సంక్షేమ కార్యక్రమాల తీరు భేష్
- దేశంలోనే తెలంగాణ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుంది : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 24 ( నినాదం న్యూస్) :** సమాజంలో ప్రజలు మెరుగైన జీవితాన్ని గడపాలి అంటే ప్రతి ఒక్కరికి అభివృద్ధి ఫలాలు అందాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లాను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవార్ ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఘన స్వాగతం పలికారు.

**జిల్లాలో సంక్షేమ కార్యక్రమాల తీరు బాగుంది**

జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాల తీరు బాగుందని  కొనియాడారు. 2021 సంవత్సరంలో రక్తహీనత శాతం ఉంటే 2024 నాటికి 21 శాతానికి తీసుకురావడం పట్ల అధికారులను అభినందించారు. ప్రతి కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు స్వయం సహాయక మహిళా సంఘాల కార్యక్రమాలు భవిష్యత్తు అభివృద్ధి మహిళ సాధికారతపై ఆధారపడి ఉందని గుర్తు చేశారు.

**దేశంలోనే తెలంగాణ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుంది : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

దేశంలోనే తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక వేగంగా అభివృద్ధి చెందుతుందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఐటీ సాఫ్ట్వేర్ ఫార్మా సైన్స్ రంగాలలో తెలంగాణ దేశంలోనే కాకుండా ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుందని తెలిపారు. వ్యవసాయంలో 28 వేల కోట్ల రూపాయల బడ్జెట్ ను వ్యవసాయానికి కేటాయించడం జరిగిందని గుర్తు చేశారు. జిల్లాలో నీటిపారుదల సౌకర్యం క్రింద ఆరు లక్షల పదహారు వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్ ను గవర్నర్ తో కలిసి పరిశీలించారు. సమావేశంలో కోదాడ శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు,జాయింట్ సెక్రటరీ భవాని శంకర్, అధికారులు కవులు, రచయితలు, కళాకారులు వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూ సేకరణ కోసం చేస్తున్న సర్వేను త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్



**జగిత్యాల, అక్టోబర్ 24 (నినాదం న్యూస్):** ఎన్ హెచ్ 63 నిర్మాణం కోసం చేస్తున్న భూ సేకరణ పనులను అధికారులు సమన్వయంతో వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. గురువారం బుగ్గారం మండలంలో జాతీయ రహదారుల అథారిటీ అధికారులు చేస్తున్న సర్వేను పరిశీలించారు.  ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేయాలని, రోడ్డు నిర్మాణంలో రైతులు, ప్రజలు ఇబ్బంది పడకుండా చేపట్టాలని తెలిపారు.ఈ సందర్భంగా జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోతున్న భూమి, ఇండ్లు, కట్టడాలు, చెట్లు, బో ర్లు, పైపులైన్లు, ఇతర నిర్మాణాలను పరిశీలించి, వాటికి చెల్లించాల్సిన నష్ట పరిహారం అంచనా విలువల నివేదికలు తయారు చేయుటకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కలిసి చేయాలన్నారు.ఇప్పటి వరకు చేపట్టిన సర్వేలో భూములు కోల్పోతున్న వారు తెలిపిన అభ్యంతరాలను పరిగణంలోకి తీసుకొని భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎదుర్కోవడం, అనుసరించాల్సిన విధానాలను వివరించారు.కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీనివాస్, సర్వే, రెవెన్యూ, ఫారెస్ట్, హార్టి కల్చర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క అవకాశం ఇచ్చి పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించండి

- పట్టభద్రుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకనవుతా
- నవంబర్ ఆరవ తేదీలోగా పట్టబద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి
- హుజురాబాద్ డివిజన్లో పట్టభద్రుల ఓటర్లకు అవగాహన
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు



**జమ్మికుంట, అక్టోబర్ 24 (నినాదం న్యూస్) :** ఒక అవకాశం ఇచ్చి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నన్ను గెలిపిస్తే మీ సమస్యలపై మండలిలో ప్రశ్నించే గొంతుకనవుతానని ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు అన్నారు. గురువారం హుజరాబాద్ నియోజకవర్గంలోని హుజురాబాద్ ఇల్లంతకుంట జమ్మికుంట మండలాల పట్టభద్రుల అభ్యర్థులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ.... నియోజకవర్గంలోని పట్టభద్రులంతా నవంబర్ ఆరవ తేదీలోగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఆయన అన్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాలోని పట్టభద్రుల సమస్యలపై ప్రభుత్వంతో పోరాటం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. 22 సంవత్సరాలుగా ట్రస్మా  ఫౌండర్ సభ్యుడిగా అధ్యక్షుడిగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్యలు వచ్చిన పరిష్కరించడంలో ముందున్నట్లు ఆయన తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కరోనా సమయంలో నెలకు 25 కిలోల సన్నబియ్యం 2000 రూపాయలు అప్పుడున్న కేసీఆర్ ప్రభుత్వ పెద్దలను ఒప్పించి రాష్ట్రంలోని 1,82,000 మంది ప్రవేటు ఉపాధ్యాయులకు అందించేలా కృషి చేశానని అన్నారు. ఇంతే కాకుండా ప్రభుత్వం వసూలు చేస్తున్న విద్యా సెస్సు ఇప్పటి వరకే కేంద్ర ప్రభుత్వ వద్ద కోట్లాది రూపాయలు వృధాగా ఉందని, ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులకు 10 లక్షల బీమా కోసం, పదిలక్షల ఆరోగ్య సంరక్షణ కోసం ఆ నిధులను ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావడానికి ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయుల తరఫున మాట్లాడే గళం గా ఉండడానికి తాను ముందుకు వచ్చానని అన్నారు. నిరుద్యోగులకు కూడా అనేక వాగ్దానాలు చేసిన ప్రభుత్వాలు వాటిని అమలు చేయడంలో మరిచిపోతున్నాయని పట్టభద్రుల ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే ప్రభుత్వం నుండి వాటిని వచ్చేలా ఒత్తిడి తీసుకొని వస్తానని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పైన వారి ఎమ్మెల్సీలు ఉండి పోరాటం చేస్తారని ప్రైవేటు ఉద్యోగుల , నిరుద్యోగుల సమస్యలపై అవగాహన ఉన్న తనలాంటివారు పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే ముందుండి పోరాటం చేస్తానని అన్నారు. తాను పోటీలో ఉన్నది ఉన్న ఆస్తులను కాపాడుకోవడానికి కాదని, నిజాయితీగా తన వాళ్లకు సేవ చేయడానికి ముందుకు వచ్చానని అన్నారు. 22 సంవత్సరాలుగా తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రైవేటు విద్యాసంస్థల సమస్యలపై పోరాటం చేశానని అన్నారు. ఇంతే కాకుండా ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయుల ఉద్యోగుల సమస్య లపై పోరాటం చేసిన విషయం అందరికీ విధితమే  అని అన్నారు. తాను ఇండిపెండెంట్ గా పోటీలో ఉన్నట్లు తనకు అన్ని విద్యార్థి సంఘాల, రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల, స్వచ్ఛంద సంస్థల మద్దతు ఉందని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవడమే కాకుండా తమకు తెలిసిన పట్టభద్రుడు కూడా ఓటర్లుగా నమోదు చేయించాలని అలాగే మీ సమస్యలపై పోరాటం చేసే మీ వెన్నంటి ఉండే యాదగిరి శేఖర్ రావుకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి నన్ను గెలిపించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్ రావు తో పాటు, జమ్మికుంట కాకతీయ విద్యాసంస్థల అధినేత సుధాకర్ రావు, ట్రస్మా నాయకులు సంపత్ రావు, ప్రతాపరెడ్డి, మల్లారెడ్డి, వకులాభరణం వెంకటేశ్వర్లు, కోమల్ రెడ్డి, కృష్ణారెడ్డి, బత్తుల రాజ్ కుమార్, కోటేశ్వర్, మాడిశెట్టి ప్రసాద్, కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## చట్ట సభలో నిరుద్యోగుల గొంతుక నవుతా

- యువత కోసం స్వచ్ఛందంగా కోచింగ్ సెంటర్లు
- ప్రతి ఒక్కరు నవంబరు06 లోపు తమ ఓటు నమోదు చేసుకోవాలి
- సిద్ధిపేట లో ఉచిత ఓటరు నమోదు కార్యాలయాన్ని ప్రారంభించిన ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



**కరీంనగర్, అక్టోబర్ 24(నినాదం న్యూస్) :** రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే ఉద్యోగ నిరుద్యోగ సమస్యలపై మండలిలో గళమెత్తుతానని పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డా వి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం సిద్ధిపేట జిల్లా కేంద్రంలో ఉచిత ఓటరు నమోదు కార్యాలయం ను ప్రారంభించారు... అనంతరం పలువురు పట్టభద్రులను కలసి రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు పలకాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రతి ఒక్క పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు.. 2021 నాటికి లేదా అంతకు ముందు పట్టభద్రులై ఉన్నవారు ..వచ్చే నెల నవంబర్ 6 వరకు పట్టభద్రులు ఓటరుగా ఎన్రోల్ చేయించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు సులభతరం చేసేందుకు ఇప్పటికే మిస్డ్ కాల్ క్యాంపియన్ ప్రారంభించినట్టు వెల్లడించారు.. ప్రతి నియోజకవర్గ పరిధిలో తమ ప్రతినిధులు కేంద్రాలు ఏర్పాటు చేసి అందుబాటులో ఉంటారని, ఓటర్ గా ఎన్రోల్ చేసుకోవాలనుకునే వారు అప్లికేషన్ తో పాటు వారి ఆధార్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, డిగ్రీ సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు తమ ప్రతినిధులకు అందజేస్తే వారే ఆన్లైన్ లో ఎన్రోల్ చేసి, సర్టిఫికెట్లు సబ్మిట్ చేస్తారని నరేందర్ రెడ్డి తెలిపారు.ఈ అవకాశాన్ని పట్టభద్రులు అందరూ వినియోగించుకోవాలని కోరారు.కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో లక్షలాదిమంది పట్టభద్రులు ఉన్నప్పటికీ గత ఎన్నికల్లో వరకు 1.97 లక్షల మంది మాత్రమే ఓటర్లుగా తమ పేరును నమోదు చేయించుకున్నారని అన్నారు. గత ఎన్నికల్లో 1.07 లక్షల మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.అదే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదై, మెజారిటీ సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకుంటారని అన్నారు.గతంలో గెలిచిన ఎమ్మల్సిలు రాజకీయాలకే సమయం కేటాయించారు తప్ప నిరుద్యోగులు గురించి పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.. నిరుద్యోగులకు అండగా నిలిచి ..ప్రభుత్వానికి -పట్టభద్రులకు వారధిగా నిలిచి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.

## నౌకాదళ క్విజ్‌కి ఎంపికైన కోదాడ తేజ విద్యాలయ



**కోదాడ, అక్టోబర్ 24 (నినాదం న్యూస్):** జాతీయ స్థాయిలో భారత నావికా దళం థింక్యూ 2024 పేరు మీద పాఠశాల స్థాయి విద్యార్థులకు దేశ వ్యాప్తంగా సెప్టెంబర్ నెలలో క్విజ్ నిర్వహించింది. ఈ పోటీలలో దేశవ్యాప్తంగా 9000 పాఠశాలలు పాల్గొన్నాయి. మూడు దశల్లో రాత పరీక్ష మరియు మౌఖిక పరీక్షల ద్వారా వడపోత పోసి ఉత్తర , దక్షిణ , తూర్పు, పడమర విభాగాలుగా నాలుగు ప్రాంతాల్లో నుంచి జాతీయ స్థాయిలో ఫైనల్ పోటీలకు అత్యుత్తమంగా నిలిచిన 16 పాఠశాలల జట్లను ఎంపిక చేయడం జరిగింది.తెలంగాణ నుంచి రెండు పాఠశాలలు ఎంపికయ్యాయి. సూర్యాపేట జిల్లా కోదాడ తేజ విద్యాలయ మరియు హైదరాబాద్ లోని జాన్సన్ గ్రామర్ పాఠశాల కోదాడ తేజ విద్యాలయలో చదవుతున్న విద్యార్థులు నోముల సృజన్ గుప్త , కొంౘ్ర నవీన్ కుమార్ , జట్టు ఎంపిక కావడం జరిగిందని ప్రిన్సిపల్ తెలియపరిచారు. వీరికి తుది పోటీలు నవంబర్ 7 మరియు 8వ తేదిలలో కేరళ లోని ఎఝిమల భారతీయ నావికా శిక్షణ కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని క్విజ్ నిర్వాహకులు లేఖ పంపారని తెలిపారు.ప్రతిష్మాత్మకమైన ఈ పోటీలకు ఎంపికైన 16 పాఠశాలలకు చెందిన 32 మంది విద్యార్థులతో పాటు ప్రతి పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడు మరియు ఒకరి తల్లి/ తండ్రికి ఈ క్విజ్ పోటీల వేదిక కు ఆహ్వానించారు. వీరికి విమాన ప్రయాణం , అన్ని ఏర్పాట్లను భారత నావికాదళం ఏర్పాటు చేయడం జరుగింది. తేజ విద్యాలయ విద్యార్దులతో పాటు సాంఘిక శాస్త్ర అధ్యాపకులు ఉస్తేల ధనుష్ రెడ్డి మరియు తల్లిదండ్రుల నుంచి నోముల వెంకటేశ్వర్లు వెళ్లడం జరుగుతుందని ప్రిన్సిపాల్ ఉస్తేల రమాదేవి తెలిపారు.

## రజక కార్పొరేషన్‌కు పాలకవర్గాన్ని నియమించాలి

**- ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో రజకులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలి**
**- రజక సంఘాల వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పూసాల సంపత్**

**కరీంనగర్, అక్టోబర్ 24(నినాదం న్యూస్) :** తెలంగాణ రజక సంఘం



జిల్లా కార్యాలయంలో గురువారం రోజున జిల్లా సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రజక సంఘాల వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పూసాల సంపత్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రజకులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రజక కార్పొరేషన్కు 5 వేల కోట్లు కేటాయించి పాలకవర్గాన్ని నియమించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో రజకులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని, ఉచిత విద్యుత్ ఎల్టి-2 నుండి ఎలి-4కు మార్చాలని, రజక సొసైటీకి 30 లక్షలు ఇవ్వాలని, 50 సంవత్సరాలు దాటిన రజక వృత్తిదారులకు 5 వేల రూపాయల ప్రత్యేక పెన్షన్ ఇవ్వాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా రజక కార్పొరేషన్కు నిధులు కేటాయించక పట్టించుకోలేదని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి రజక సంఘాలను ఆదుకోవాలని, వచ్చే స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు గుర్తించాలని, బీసీలలో రాజకీయంగా వెనుకబడిన రజక యువకులు, మేధావులు పోటీ చేయాలని, జీవో 343 ప్రకారం చెరువుల్లో చేపలు పట్టుకునే హక్కును పొంది రజకులకు ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి మేడిచెలిమెల అనిల్ ను నియమించడం జరిగింది.ఈ సదస్సులో రాష్ట్ర నాయకులు రాపాల శంకర్, కొల్లూరి కుమార్, రాచకొండ నరేశ్, జిల్లా అధ్యక్షుడు పూసాల శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ మునిగంటి అశ్విన్, నేరెళ్ల లక్ష్మణ్, తడిగొప్పుల శ్రీపాల్, వెదిర వెంకటేశ్, పాల్గొన్నారు.

## మాస్టర్ ప్లాన్ అమలైతే జోనింగ్ రెగ్యులేషన్స్ ద్వారానే అనుమతులు

- **పంచాయతీ సెక్రెటరీలకు లాగిన్ ఇవ్వడం జరిగింది**
- **నగరంతో పాటు సుడా పరిధిలో త్వరితగతిన మాస్టర్ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకువస్తాం**
- **సుడా చైర్మన్ నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వెల్లడి**



**కరీంనగర్, అక్టోబర్ 24(నినాదం న్యూస్ ) :** సుడా పరిధిలోని ప్రజలు ఎల్ఆర్ఎస్ ను సద్వినియోగం చేసుకోవాలని,ఎల్ఆర్ఎస్ ఉంటేనే నూతన ఇంటి నిర్మాణం కోసం అనుమతి పొందే అవకాశం ఉంటుందని, ఎల్ఆర్ఎస్ కటాఫ్ తేదీ ముగిస్తే, మళ్ళీ అవకాశం వచ్చేంత వరకు వేచి చూడాల్సి వస్తుందని సుడా చైర్మన్,నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.నగరంలోని రోడ్లు భవనాల అతిథి గ్రహంలో లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడారు. 26.08.2020 తర్వాత వ్యవసాయ భూముల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ చేసుకునే అవకాశం కానీ బిల్డింగ్ పర్మిషన్ కానీ తీసుకునే అవకాశం లేదన్నారు. అప్రూవల్ లేఅవుట్ ప్లాట్ లకే ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. సుడా పరిధిలో ఇప్పటివరకు ఇంకా ఇరవై ఒక్క వేల అప్లికేషన్లు పెండింగ్లో ఉన్నాయని, పెండింగ్ అప్లికేషన్ల క్రమబద్ధీకరణ కోసం త్వరితగతిన క్లియర్ చేసుకోవాలని ప్రజలకు సూచించారు.సుడా అప్లికేషన్ లను సవరించడానికి,అనుమతి కోసం, గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులకు లాగిన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఇక 1997 తరువాత మాస్టర్ ప్లాన్ రూప కల్పన జరుగలేదని మాస్టర్ ప్లాన్ ను నగరంతో పాటు శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో త్వరితగతిన అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు.మాస్టర్ ప్లాన్ అమలులోకి వస్తే జోనింగ్ వ్యవస్థ ఏర్పడుతుందని, రెసిడెన్షియల్ జోన్, కమర్షియల్ జోన్, ఇండస్ట్రియల్ జోన్ లుగా విభజించి ఎవరు ఏ పరిధిలోకి వస్తారో పూర్తిగా దాని ప్రకారం నిర్మాణాలకు అనుమతి లభించే అవకాశం ఉంటుందన్నారు. ఈనెల చివరి లోపు మాస్టర్ ప్లాన్ పై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేల సమయం తీసుకొని అధికారుల సమక్షంలో ప్రజాభిప్రాయసేకరణ కోసం సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ దిక్సూచిలా ఉంటుందన్నారు.వ్యవసాయ భూములలో రైతు భరోసా,రుణమాఫీ,ఉచిత విద్యుత్ సౌకర్యాలు పొందుతూ,కమర్షియల్ ఫాంస్ గా,రిసార్టు లుగా వ్యాపారం చేసుకునే వారు సుడా పర్మిషన్ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఇక అంగారికా టౌన్ షిప్ లో ప్లాట్లు కొన్న వారికి మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం కృషి చేస్తున్నామని అన్నారు.గతంలో వేలం ద్వారా వచ్చిన నిధులతో గత పాలకులు అభివృద్ధి చేయాల్సి ఉండే చేయకపోవడం వల్ల వేలంలో ప్లాట్లు కొన్న వారంతా సొసైటీగా ఏర్పడి పలుమార్లు మాదృష్టికి తీసుకు రావడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం రెండు కోట్లతో పనులు చేయడానికి టెండర్లు పిలిచామని వెంటనే పనులు ప్రారంభిస్తామని ఈ పనులు పూర్తయ్యే లోపు మిగితా నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నార.ప్రభుత్వంలో లేనప్పుడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా పలు కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికి సహకరించి, ఇప్పుడు గత నాలుగు నెలలుగా సుడా చైర్మన్ గా తన పనితీరును ఎప్పటికప్పుడు మీడియా ద్వారా చేరవేస్తున్న మీడియా ప్రతినిధులందరికీ కోమటిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులో సుడా అభివృద్ధికి అందరి సహకారం అవసరమని,అందరూ ఎల్లవేళలా సుడాభివృద్ధికి సహకరిస్తారని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.ఈ విలేఖరుల సమావేశంలో సయ్యద్ ఖంరొద్దిన్,కుర్ర పోచయ్య,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,దండి రవీందర్,లయక్,షబానా మహమ్మద్రజితా రెడ్డి,ముల్కల కవిత,తిరుమల,హసీనా,మహాలక్ష్మి,మాసుంఖాన్, సత్యనారాయణ రెడ్డి,కిరణ్ రెడ్డి,సుదర్శన్,షేహెన్షా,అస్తపురం రమేష్,కొట్టె ప్రభాకర్,బషీర్,భారీ,ఖలీల్,నదీమ్,తమ్మడి ఎజ్రా తదితరులు పాల్గొన్నారు.

## జగపతిరావు విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

- **మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన నాయకులు**



**కరీంనగర్, అక్టోబర్ 24(నినాదం న్యూస్) :** ప్రముఖ తెలంగాణ ఉద్యమకారులు, సీనియర్ కాంగ్రెస్ నేత మాజీ ఎమ్మెల్యే దివంగత వెలిచాల జగపతిరావు విగ్రహం ఏర్పాటు కోసం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్థలం కేటాయించి అనుమతి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్పాయ్ కి గురువారం నగర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సరిల్ల రతన్ రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దివంగత నేత జగపతి రావు విగ్రహం ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించి అనుమతి ఇవ్వాలని కోరారు.కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుగా తాము మీ ప్రతిపాదన తమరికి సమర్పిస్తున్నామని వివరించారు , వెలిచాల జగపతి రావు 1972 నుంచి 1977 వరకు జగిత్యాల నియోజకవర్గం నుండి శాసనసభ్యులుగా, 1978 నుండి 1984 వరకు శాసనమండలి సభ్యులుగా పనిచేశారని తెలిపారు. 1989 నుండి 1994 వరకు కరీంనగర్ నియోజకవర్గం నుంచి మరోసారి శాసనసభ్యుడిగా పనిచేశారని వివరించారు. ఆయన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా ఎంతో మంచి పేరు సంపాదించారని పేర్కొన్నారు. కరీంనగర్ ప్రజలు ఆయన్ను ప్రజాబంధుగా గౌరవించారని, పేదల కోసం నిరంతరం హరితపించిన మహా నేత జగపతిరావు అని వివరించారు. కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేశారని తెలిపారు. ఆయన అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజల అభివృద్ధికి ఎంతో దోహదపడ్డాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గండి రాజేశ్వర్, మాజీ నగర ప్రధాన కార్యదర్శి సరిళ్ళ రతన్ రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గండి శ్యామ్, పులి నరసింగం, కాసారపు కిరణ్, గండి గణేష్, పెద్ది రవి తదిరులు ఉన్నారు.

## మేయర్ సునీల్ రావుపై అనర్హత వేటు వేయాలి

- **జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చిన 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్**

**కరీంనగర్, అక్టోబర్ 24(నినాదం న్యూస్) :** అక్రమ లేఅవుట్ల ద్వారా ప్రభుత్వ భూమి అయిన స్మశాన వాటిక, చెరువు శిఖం స్థలాల కబ్జాకు పాల్పడిన కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్ రావు పై చర్యలు చేపట్టి అనర్హత వేటు వేయాలని కోరుతూ, 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్ గురువారం జిల్లా కలెక్టర్ కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ గా ఉన్న యాదగిరి సునీల్ రావు కార్పొరేషన్ పరిదిలోని రేకుర్తి 18వ డివిజన్లో సర్వే నెం. 65లోని ప్రభుత్వ భూములు అయిన దళితుల స్మశాన వాటిక, చెరువు శిఖం. భూముల్లో లే- అవుట్ భూమిని అక్రమంగా కబ్జాకు పాల్పడమే కాకుండా గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సునిల్ రావు పేరుతో 4 డాక్యుమెంట్లు రిజిష్టర్ చేయించుకున్నారు. ఈ స్థలానికి ఆనుకొని ఉన్న సర్వే నెం. 55లో గతంలో గ్రామ పంచాయితీ నిధులు రూ.15 లక్షలతో దింపుడు కల్లం గద్దె, బోరు బావి, స్నానాల గదులను నిర్మించి అప్పటి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేతుల మీదుగా 2017 జనవరి 13న ప్రారంభించారు. ప్రభుత్వ భూమి అని తెలిసి కూడా భాధ్యత గల మేయర్ పదవిలో ఉండి తన అధికారాన్ని అడ్డుపెట్టుకొని మున్సిపల్ అధికారుల సహకారంతో ఆ నిర్మాణాలను ఉద్దేశ్యపూర్వకంగా తొలగించారు. ఇలా స్మశాన వాటిక, చెరువు శిఖం కబ్జాకు పాల్పడడమే కాకుండా, 9 వేర్వేరు ప్లాట్లను కొనుగోలు చేసి వాటికి కంపౌండ్ వాల్ ఏర్పాటు చేసి రహదారులను కూడా మింగేశారు. ఇలా అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయడమే కాకుండా, అందులో ప్రభుత్వ భూములైన దళితుల స్మశాన వాటికలో నిర్మాణాలు కూల్చడంతో పాటు చెరువు శిఖం కూడా మింగేసిన



## మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిధర్ రావు జన్మదిన ఘనంగా నిర్వహించిన బత్తుల వినోద్




**వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 (నినాదం న్యూస్) :** గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలోని వరంగల్ 12వ డివిజన్ వరంగల్ దేశాయిపేట లోని చంద్రకాంత మెమోరియల్ కళాశాల వద్ద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ప్రియతమ నాయకుడు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని కొండా యువసేన ప్రెసిడెంట్, వరంగల్ ఈస్ట్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ బత్తుల వినోద్ ఆధ్వర్యం లో సి కే ఏం కళాశాల వద్ద కేక్ కటింగ్, పండ్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించినారు.ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ నాయకులు పిసిసి డెలికేట్ మెంబర్ నల్గొండ రమేష్ పాల్గొని కేక్ కటింగ్, పండ్ల పంపిణీ చేసినారు. ఈ సందర్భంగా నల్గొండ రమేష్ మాట్లాడుతూ మా అభిమాన నాయకుడు కొండ మురళీధర్ రావు ఎల్లప్పుడూ సుఖ సంతోషా లతో, ఆయురారోగ్యా లతో, ఉండి పేదలకు ఎప్పుడు సేవ చేసేలా భగవంతుని శక్తి నివ్వాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు ఇనుగాల బాబు, నీలం మధు, నాగోతు మురళి, కుసుమ మురళి, చిమ్మని వేణు, కొమ్ముల ప్రదీప్, అరుణ్, ఎండి నవాజ్, శరత్, శ్రీధర్, చంటి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కొండ అభిమానులు, పాల్గొన్నారు.

## కూరగాయల మార్కెట్ భవనానికి గుండా మల్లేష్ పేరు పెట్టాలి



**బెల్లంపల్లి అక్టోబర్ 24 (నినాదం న్యూస్) :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో నూతనంగా నిర్మించిన కూరగాయల విక్రయ భవన సముదాయానికి మాజీ ఎమ్మెల్యే దివంగత గుండా మల్లేష్ పేరు నామకరణం చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు గురువారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో మంచిర్యాల జిల్లా సిపిఐ కార్యదర్శి రామడుగు లక్ష్మణ్,బెల్లంపల్లి సిపిఐ పట్టణ పార్టీ కార్యదర్శి ఆడెపు రాజమౌళి,రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాస్,జోగుల మల్లయ్య సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి,మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ,జిల్లా సమితి సభ్యులు గుండా మాణిక్యం,మిట్టపల్లి పౌలు,చాడ మహేందర్ రెడ్డి,దేవి పోషన్న,బియ్యాల ఉపేందర్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోలీసుల ఓపెన్ హౌస్ ప్రదర్శన



**బెల్లంపల్లి అక్టోబర్ 24 (నినాదం న్యూస్) :** పోలీస్ అమరవీరుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా చట్టాలు,ఆయుధాల వినియోగం అవగాహన కోసం బెల్లంపల్లి రూరల్ సిఐ సయ్యద్ అఫ్జలుద్దీన్ స్థానిక కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో ఓపెన్ హౌస్ ప్రదర్శన ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సిఐ పోలీసులు వాడే ఆయుధాలతో పాటు అనేక పరికరాలు ఎలా ఉంటాయి,అవి ఎలా పనిచేస్తాయనేది సిబ్బందితో కలిసి ఆయుధ ప్రదర్శన నిర్వహించారు.శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు వాడే ఆయుధాలు,ఆధునిక సాంకేతిక పరికరాలను ప్రదర్శించి వాటి గురించి విధ్యార్థులకు వివరించారు.ఆయుధాలతో పాటు వాటి విడి భాగాలు,ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ నెట్‌వర్క్ సిస్టమ్,పోలీస్ కంట్రోల్ రూం పరికరాలు,కమ్యూనికేషన్ మ్యాన్ ప్యాక్ సెట్ లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.పోలీస్ సిబ్బంది విధులు,రికార్డులు,నేరం జరిగిన సమయంలో వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ నమోదు,దర్యాప్తు,విచారణ నిందితులను పట్టుకోవడం వారిని కోర్టు ముందు హాజరు పరచడం,వారికి శిక్షల గురించి వివరించారు.పోలీస్ శాఖ ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం గురించి డయల్ 100,బ్లూ కోల్ట్స్,పెట్రో కార్ సిబ్బంది విధులు,షీ టీమ్స్ పనితీరు,మహిళల రక్షణ కోసం ఉన్న సాంకేతిక యాప్ ల గురించి,సైబర్ నేరాలపై డయల్ 1930,చైల్డ్ హెల్ప్ లైన్ పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి టూ టౌన్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి,కానిస్టేబుల్ లవన్ కుమార్,తాళ్ల గురిజాల హెడ్ కానిస్టేబుల్ లు అశోక్,ప్రేమ్ చంద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల నివేశన స్థలాల సమస్యను పరిష్కరించాలి

- **టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు జర్నలిస్టుల విజ్ఞప్తి**

**జమ్మికుంట, అక్టోబర్ 24 (నినాదం న్యూస్) :** హుజురాబాద్ జర్నలిస్టులకు గత ప్రభుత్వం అందించిన నివేషణ స్థలాల సమస్యను పరిష్కరించాలని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కు హుజురాబాద్ ప్రెస్ క్లబ్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాదులోని గాంధీభవన్ లో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకొని సత్కరించారు. అనంతరం హుజురాబాద్ జర్నలిస్టులకు ఇచ్చిన నివేషణ స్థలాలకు సంబంధించి ముఖ్యమంత్రి తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ కో- కన్వీనర్లు కాయిత రాములు ,నిమ్మటూరు సాయికృష్ణలు మాట్లాడుతూ.... గత 20 ఏళ్లుగా హుజురాబాద్ లో పాత్రికేయులుగా కొనసాగుతున్న తమకు గత ప్రభుత్వం కేసీ క్యాంపులో నివేశన స్థలాల ను అందజేసిందని, దీనికి సంబంధించి నెలకొన్న



కోర్టు సమస్యను ఈఎన్ సి సర్టిఫికెట్ అందించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి పరిష్కరించాలని టిపిసిసి అధ్యక్షున్ని కోరినట్టు తెలిపారు. జర్నలిస్టుల నివేశన స్థలాల సమస్యను తక్షణమే పరిష్కరించాలని వారికి విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించి జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. మహేష్ కుమార్ గౌడును కలిసిన వారిలో ప్రెస్ క్లబ్ అడక్ కమిటీ సభ్యులు పోతరాజు సంపత్, సభ్యులు తాటిపాముల దేవేందర్ లు ఉన్నారు.

# ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు అండగా సైబరాబాద్ పోలీసులు

- **చోరీకి గురైన రెండు కోట్ల విలువచేసే 800 సెల్ ఫోన్‌లు స్వాధీనం**
- **బాధితులకు ఫోన్లు పంపిణీ చేసిన సైబరాబాద్ డీసీపీ నరసింహ**
- **నేరాలపట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలి**





**మాదాపూర్ న్యూస్ (నినాదం ) ప్రతినిధి :** వివిధ సందర్భాలలో ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు సైబరాబాద్ పోలీసులు బాసటగా నిలిచారు. చోరీకి గురైన రెండు కోట్ల పైబడి విలువ చేసే 800 సెల్ ఫోన్ లో రికవరీ చేసి బాధితులకు అందజేశారు. సైబరాబాద్ క్రైమ్స్ డిసిపి నరసింహ కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్వహించి బాధితులకు ఫోన్లు అందజేశారు. ఈ సమావేశంలో సిసిఆర్బి ఏసిపి కళింగరావు, సిసిఎస్ ఏసిపి శశాంక్ రెడ్డి, ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ జగదీశ్వర్, రాజేంద్రనగర్, శంషాబాద్ ,బాలనగర్, మేడ్చల్ సిసిఎస్ ఇన్స్పెక్టర్ సంజయ్ కుమార్, పవన్ రాజు, నరసింహ, డి ఐ వెంకటరెడ్డి లతో కలిసి వివరాలు వెల్లడించారు.

చోరీకి గురైన ఫోన్లు అసాంఘికసత్తులు చేతుల్లోకి వెళ్తే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్కువ ధరకు ఫోన్ దొరుకుతుందని చోరీ చేసిన వాటిని కొనుగోలు చేస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. చోరీ సొత్తు అమ్మిన కొనుగోలు చేసిన అవుతుంది. సి ఈ ఐ ఆర్ వెబ్సైట్ రాకతో ఫోన్లు చోరీ చేసేవారు కటకటాల్లోకి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. సెల్ఫోన్లో అందుకున్న బాధితులు సంతోషం వ్యక్తం చేశారు. దొరకదు అనుకున్న ఫోను పోలీసులు తెచ్చి ఇవ్వడంతో ఆనందానికి అవధులు లేవని పలువురు సంతోషం వ్యక్తం చేశారు సైబరాబాద్ పోలీసులు చేసిన కృషికి ధన్యవాదాలు తెలిపారు యూపీఐ చెల్లింపులు జరిపినప్పుడు బయట వ్యక్తులకు పిన్ నెంబర్ కనబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు సెల్ఫోన్ ద్వారా జరిపే లావాదేవీలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు గుర్తు తెలియని వ్యక్తులు పంపించే లింకులు ఎట్టి పరిస్థితులను తెరవద్దని కోరారు సెల్ ఫోన్లు ఏ విధంగా రికవరీ చేసింది వివరించారు

2 సబ్ ఎడిట్ చేతిలో ఉన్న సెల్ ఫోన్ క్షణం కనిపించకపోతే గుండే ఆగిపోయినంత విలవిలాడిపోయే రోజులువి. అందులో విలువైన సమచారం, ఫోన్ నంబర్లు, మెసేజ్‌లు, ఫోటోలు, వీడియోలు, బ్యాంకింగ్ యాప్‌లు ఒకటేమిటి. ఇవన్నీ ఉన్న ఫోన్ చోరీకి గురైతే సర్వం కోల్పోయినట్లు భావిస్తుంటారు. మొబైల్ ఫోన్ పోతే దొరికే అవకాశం లేదని భావిస్తున్న తరుణంలో పరిస్థితులు ఉండవు. ఈ సమస్యకు పరిష్కారంగా కేంద్ర టెలికాం విభాగం సరి కొత్త సేవలను తీసుకొచ్చింది. అదే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిడీ రిజిస్ట్రీ (%జజు×=%). ఈ యాప్ సెల్ ఫోన్ వాడకం దారులకు వరం కాగా దొంగలకు చేతికి బేడీలు వేయిస్తుంది. సీఈఐఆర్ (%జవత్‌ఝ్రీ జునబఅజూఎవత్ ×ునవత్‌ఱఎ =వస్త్రఱర్‌తీఎ%) టెక్నాలజీతో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మూడు విడుదలగా 1700 ఫోన్లు రికవరీ చేశారు. తాజాగా 800 ఫోన్లు రికవరీ చేసి సెల్ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు అందజేశారు. 2019లోనే ఈ సేవలను ప్రయోగాత్మకంగా మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల్లో ప్రవేశపెట్టారు. మార్చి 15, 2023 నుంచి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఈ సేవలను అందుబాటులోకి వచ్చాయి. ఫోన్ ఐఎంఈఐ నంబర్ ఆధారంగా ఈ సీఈఐఆర్ పని చేస్తుంది. ఇందు కోసం దేశంలోని మొబైల్ నెట్ వర్క్ ఆపరేటర్లు, మొబైల్ తయారీ కంపెనీలు సంయుక్తంగా డీవోటీ కస్టమర్లకు సేవలను అందిస్తున్నాయి.

**సిఈఐఆర్ యాప్‌తో**
**సెల్ ఫోన్ దొంగతనాలు కళ్లెం**

సీఈఐఆర్ రెండు రకాలుగా వినియోగించు కోవచ్చు. నో యువర్ మొబైల్ యాప్ ప్లే స్టోర్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలి. వెబ్ వర్షన్‌లోనూ అందుబాటులో ఉంది. ఫోన్ పోయినట్లు గుర్తిస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ తీసుకుని సీఈఐఆర్ పోర్టల్ లో వివరాలు నమోదు చేయాలి.అందులో బ్లాక్ స్టోలెన్ లేదా లాస్ట్ మొబైల్, అన్ బ్లాక్ ఫౌండ్ మొబైల్, చెక్ రిక్వెస్ట్ స్టేటస్ అని మూడు ఆప్షన్లు కనిపిస్తాయి. వాటిలో బ్లాక్ స్టోలెన్ లేదా లాస్ట్ మొబైల్ ఆప్షన్ ఎంచుకొని డివైజ్ ఇన్ఫర్మేన్ సెక్షన్‌లో ఫోన్ నంబర్, ఐఎంఈఐ నంబర్, ఫోన్ బ్రాండ్, మోడల్, మొబైల్ కొన్న రశీదు ఫోటోను అప్లోడ్ చేయాలి. లాస్ట్ ఇన్ఫర్మేషన్ సెక్షన్‌లో ఫోన్ పోగొట్టుకున్న ప్రాంతం, తేదీ, పోలీస్ ఫిర్యాదు నంబర్ వివరాలు అందించి ఎఫ్ఐఆర్ కాపీ అప్లోడ్ చేయాలి.

ఆ తర్వాత మొబైల్ యూజర్ పేరు, చిరునామా, గుర్తింపుకార్డ, ఇ-మెయిల్ తదితర వివరాలు నమోదు చేయాలి.తరువాత రిక్వెస్ట్ తీసుకున్నట్లు ఐడీ నంబర్ చూపిస్తుంది. ఈ నెంబర్ ద్వారా కంప్లెయింట్ స్టేటస్ తెలుసుకోవచ్చు. యాప్ లో నమోదు చేసిన వివరాలు ఆధారంగా మొబైల్‌ను గుర్తించి సీఈఐఆర్ బ్లాక్ చేస్తుంది. ఆ వివరాలను మొబైల్ నెట్‌వర్క్ ఆపరేటర్లకు పంపుతుంది. ఎవరైనా దాంట్లో వేరే సిమ్ కార్డు వేస్తే వెంటనే సీఈఐఆర్‌కు అలర్ట్ మెసేజ్ వస్తుంది. దాంతో యూజర్ పోగొట్టుకున్న ఫోన్ ఏ ప్రాంతంలో ఉందో తెలుస్తుంది.

పోగొట్టుకున్న ఫోన్ దొరికితే యూజర్ సీఈఐఆర్ పోర్టల్‌ల అన్ బ్లాక్ ఫౌండ్ మొబైల్ పై క్లిక్ చేసి రిక్వెస్ట్ ఐడీ, ఫోన్ నంబర్ వివరాలను సమర్పిస్తే ఫోన్ అన్ బ్లాక్ అవుతుంది. ఫోన్ కొనుగోలు చేసేవారు దాని ఐఎంఈఐ నంబర్ ద్వారా కేవైఎం పోర్టల్‌లో చెక్ చేసుకోవచ్చు. కేవైఎం అని టైప్ చేసి 15 అంకెల ఐఎంఈఐ నంబర్‌ను 14422కు మెసేజ్ చేస్తే అది బ్లాక్ లిస్ట్‌లో ఉందో లేదో తెలుస్తుంది.

## ఆయిల్ ఫామ్ సాగు వైపు రైతులను ప్రోత్సహించాలి

- **అధికారులతో సమీక్షించిన కలెక్టర్ శ్రీహర్ష**



**పెద్దపల్లి ప్రతినిధి , అక్టోబర్ 24( నినాదం) :** జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. కలెక్టరేట్ లో గురువారం నిర్వహించిన సమావేశంలో జిల్లాలో ఆయిల్ పామ్ సాగు గురించి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది కొత్తగా 324 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు చేశారన్నారు. మరో 350 ఎకరాలలో చేయడానికి రైతులు సన్నద్ధంగా ఉన్నారని కలెక్టర్ తెలిపారు. డిసెంబర్ నాటికి పెద్దపల్లి జిల్లాలో కొత్తగా వేయి ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డీడీలు సమర్పించిన రైతులకు మొక్కల సరఫరా, డ్రిప్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో హార్టికల్చర్ జిల్లా అధికారి జగన్మోహన్ రెడ్డి, ఏడిఏ కాంతారావు, జ్యోతి పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక



**కరీంనగర్, అక్టోబర్ 24(నినాదం న్యూస్) :** ఫుట్బాల్ క్రీడ విశ్వ క్రీడని ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందినదని ఈ క్రీడలో పాల్గొనడానికి ఆసక్తి చూపుతానని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసినటువంటి విద్యార్థుల అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,అతి పురాతనమైన క్రీడా అని తెలుపుతూ ప్రతి ఒక్క విద్యార్థి క్రీడల పట్ల ఆసక్తి ప్రదర్శించడమే కాకుండా వాటిలో పాల్గొని పెంపొందించుకొని విజయవకాశాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో విశ్వాసం నింపడానికి క్రీడల పట్ల దృష్టి మళ్లించడానికి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పిస్తూ వివిధ స్థాయిలో నిర్వహింపబడే పోటీలకు ఎంపిక చేస్తూ, వారికి అన్ని రకాలుగా చేయూత నిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో గోదావరిఖనిలో నిర్వహించినటువంటి జోనల్ స్థాయి ఎస్.జి.యఫ్ అండర్ 14 ఫట్బాల్ ఎంపిక పోటీలలో పాఠశాలకు చెందిన యన్. నిశితల్, 8తరగతి, డి. సహస్రరెడ్డి, 9వ తరగతి, యం.డి ముక్రామ్, 8వ తరగతి, హేమంత్, 9 వ తరగతి లు అసమాన ప్రతిభను కనబరచడమే కాకుండా త్వరలో మహబూబ్ నగర్ లో నిర్వహించబోయే ఎస్.జి.ఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అవడం చాలా గొప్ప విషయం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వంగర శివారులో లోకయుక్తా విచారణ



**భీమదేవరపల్లి అక్టోబర్ 24 (నినాదం న్యూస్) :** లోకయుక్తా ఆదేశాలతో విచారణాధికారి మత్తాయి కౌశ భీమదేవరపల్లి మండలంలోని తహశీల్దార్ ఆఫీసులో, వంగర శివారులో 709/3 సర్వే నంబరులో గురువారం విచారణ చేపట్టారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరకు చెందిన పింగిళి జైపాల్ రెడ్డి కూతురు ప్రత్యూష లోకాయుక్తలో పిర్యాదు చేసారు. తమకు చెందిన భూమిని ఇదే గ్రామానికి చెందిన ఐత నాగయ్య అనే వ్యక్తి వట్టా చేసుకున్నట్లు పిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో లోకయుక్త విచారణాధికారి వంగర శివారులోని చిన్నబోయిన కుంట చెరువు పక్కన గల 709 / 3 సర్వే నంబరులో మోఖ, తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు విచారణ జరిపారు. దానం ద్వారా సదరు భూమి ఐత నాగయ్యకు సంక్రమించినట్లు భూరికార్డులు లోకయుక్త అధికారికి నివేదించినట్లు తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# సెంట్రల్ డ్రగ్ స్టోర్ భవన నిర్మాణ పనుల పరిశీలన

- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల టౌన్ అక్టోబర్ 24 నినాదం న్యూస్ :** జిల్లా కేంద్రంలోని ఐ.టి.ఐ. కళాశాల ఆవరణలో చేపట్టిన సెంట్రల్ డ్రగ్ స్టోర్ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం సెంట్రల్ డ్రగ్ స్టోర్ భవనాన్ని ఆకస్మికంగా సందర్శించి కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మట్లాడుతూ మంచిర్యాల జిల్లా పరిధిలో మందుల పంపిణీ కొరకు సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అంతకు ముందు హైదరాబాద్, ఆదిలాబాద్ నుండి మందుల పంపిణీ జరిగేదని, జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డ్రగ్ స్టోర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు, పాలకులతో అధికారులు కీలకం



- **ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ హెచ్చరిక**

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 24 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయం సమావేశంలో ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో నిర్మాణ దశలో ఉన్న పనులపై, పెండింగ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు, పాలకుల తో పాటు ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రజలు రోగాల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

**చెత్త తరలింపులో నిర్లక్ష్యం వద్దు.**

చెత్తను తరలించడంలో శానిటేషన్ అధికారులు నిర్లక్ష్యం వహించకుండా అన్ని చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు కలిగితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు.

**ఓపెన్‌జిమ్‌లను సక్రమంగా నిర్వహించాలి.**

కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్ లలో ఇప్పటికే ఉన్న ఓపెన్ జిమ్, పార్కులను సక్రమంగా నిర్వహించడంతో పాటు నూతన ఓపెన్ జిమ్ ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలి. అదేవిధంగా పార్కుల్లో అవసరానికి అనుగుణంగా ఒకటి లేదా రెండు హై మాస్ లైట్లను ఏర్పాటుచేయడంతో పాటు ఉచిత మంజీరా నీటి కనెక్షన్ ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**కాలనీలలో ప్యాచ్ వర్క్ పనులను వెంటనే పూర్తిచేయాలి.**

వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా కాలనీలలో తవ్విన సీసీ రోడ్ల ప్యాచ్ వర్క్ పనులను తాత్సారం చేయకుండా వెంటనే పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి. ప్రగతి నగర్ స్మశాన వాటికలో బోరెవెల్, విద్యుత్ దీపాల ఏర్పాటుతో పాటు వాటి నిర్వహణపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, ఇంచార్జ్ కమిషనర్ దిలీప్ కుమార్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# కష్టపడి చదివితే ఇష్టమైన కొలువు దక్కుతుంది

- **వివేకనంద కరస్పాండెంట్ భూసారపు రవీందర్**

**సుల్తానాబాద్, అక్టోబర్ 24 (నినాదం న్యూస్):** కష్టపడి చదివితేనే ఇష్టమైన కొలువు దక్కుతుంది అని వివేకనంద కరస్పాండెంట్ భూసారపు రవీం దర్, ప్రిన్సిపల్ మధుసూదన్ రెడ్డి లు విద్యార్థుల కు సూచించారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలో ని వివేకానందయజమాన్యం గురువారం ప్రభుత్వ పాఠశాలలో పీ ఈటిగా ఉద్యోగం సంపాదించిన క ల్వల వెంకటేష్ ను ఘనంగా సన్మానించారు. ప్రభు త్వం నిర్వహించిన డీఎస్సీలో పి ఈ టి ఉద్యోగం సంపాదించిన కల్వల వెంకటేశ్ నువివేకానంద పా ఠశాల యజమాన్యం ఘనంగాసన్మానించి,విద్యా ర్థులు ఇలామంచి మార్గంలో నడిచి మంచి ఉద్యో గాలు




సంపాదించి నట్టయితే పాఠశాలకు,తల్లి దం డ్రులకు పేరు వస్తుందని పాఠశాల కరస్పాండెంట్ రవీందర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠ శాల ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

## గీత కార్మికుడికి తీవ్ర గాయాలు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 నినాదం న్యూస్

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గణపురం మండల కేంద్రానికి చెందిన పల్లె అశోక్ అనే గీత కార్మికుడు మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుండి పడి తీవ్ర గాయాలయ్యాయి. రోజువారి గీత వృత్తిలో భాగంగా అశోక్ మంగళవారం సాయంత్రం నగరంపల్లి శివారు లంబడి తండా సమీపంలోని తాడిచెట్టు ఎక్కుతున్న క్రమంలో మధ్యలోకి వెళ్లాక మోకు జారిపోవడంతో కింద పడిపోయాడు దీంతో వెంటనే సహచర గీత కార్మికులు అతన్ని భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రధాన ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. తాడిచెట్టు పై నుండి పడిన అశోక్ నడుము తలకు కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదవశాత్తు గాయపడిన గీత కార్మికుడు అశోక్ ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం అందజేయాలని గౌడ సంఘం కార్మికులు కోరారు.

## మౌలిక వసతులకు కృషి కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్



అల్వాల్, అక్టోబర్ 24 (నినాదం న్యూస్)

మచ్చ బొల్లారం డివిజన్ లో మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట వేస్తామని డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. గురువారం మహాత్మా గాంధీ నగర్ లో( ఎంజి నగర్) 10 లక్షల వ్యయముతో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. మచ్చ బొల్లారం డివిజన్లో వేల కోట్ల రూపాయల తో అభివృద్ధి చేశామని ఆయన అన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో ఇంకను అభివృద్ధి కృషి చేస్తున్ననన్నారు.కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సృజయ్, కాలనీవాసులు నరహరి చిన్నయ్య, నరేష్, సత్యనారాయణ ,నరేందర్ సింగ్, వెంకట్ నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్ గౌడ్, సందీప్ రెడ్డి, దేవేందర్, వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

**చింతపల్లి, అక్టోబర్ 23(నినాదం న్యూస్)** మండలం ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలను ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ, ఎమ్మెస్ ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ మాదిగ, రాష్ట్ర నాయకులు బక్రమ్ శ్రీనివాస్ మాదిగ,అంకురి నాగరాజ్ మాదిగ,వింజమూరు కృష్ణ మాదిగ, వర్కాల మాజీ సర్పంచ్ వింజమూర్ రవి, చెన్నయ్య బావుండ్లపల్లి, ల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా నిర్వహించారు. మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కొడుదూటి లక్ష్మణ్ , ఉపాధ్యక్షులు నల్ల కాశయ్య, ప్రధాన కార్యదర్శి ఎర్ర కిరణ్ ,లను ఎన్నుకున్నారు .

ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ ఎఫ్ నల్గొండ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, దేవరకొండ నియోజకవర్గం ఇన్చార్జి యాదగిరి, నాయకులు అరగంటి యాదయ్య , ఎమ్మార్పీఎస్ మండల నాయకులు అరగంట జంగయ్య , మాసన పెద్దయ్య, నల్గొండ జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రచార కమిటీ సభ్యులు వెంకటరమణ,నల్ల శంకర్,సురేష్,రాకేష్,భాస్కర్ ,పవన్, భగవత్, నల్ల చంటి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు .

# అటవీ శాఖ సిబ్బందికి ప్రతి ఏటా ప్రెసిడెన్షియల్ గ్యాలెంటరీ అవార్డులు

**వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 (నినాదం న్యూస్):** దేశవ్యాప్తంగా అటవీ సిబ్బంది అందిస్తున్న నిరుపమానమైన సేవలను గుర్తిస్తూ వారికి ప్రతి యేడాది ప్రెసిడెన్షియల్ గ్యాలంట్రీ అవార్డులు అందించాలని కోరుతూ అటవీ, పర్యావరణ దేవాదాయ ధర్మాదాయ శాఖ ల మంత్రి కొండా సురేఖ కేంద్ర పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ కి లేఖను రాసారు.ఆల్ ఇండియా రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్స్ ఫెడరేషన్ విన్నపాన్ని తెలుపుతూ అటవీ అధికారులకు ఈ అవార్డును అందించాల్సిన అవసరాన్ని మంత్రి సురేఖ కేంద్రమంత్రికి వివరించారు.ఈ అవార్డుతో వారిలో నైతిక సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ఇతర యూనిఫామ్ సర్వీసు ఉద్యోగులతో సమానంగా వారికి గుర్తింపు లభించినట్లవుతుందని మంత్రి సురేఖ కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్ కు స్పష్టం చేశారు.అటవీ ఉద్యోగులకు ప్రెసిడెన్షియల్ గ్యాలంట్రీ అవార్డును అందించే దిశగా చర్యలు చేపట్టి, అడవులు, వన్యప్రాణుల సంరక్షణకై విలువైన సేవలు అందిస్తున్న వారిని ప్రోత్సహించాలని మంత్రి సురేఖ కోరారు. ఈ లేఖతో పాటు ఆల్ ఇండియా రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్స్ ఫెడరేషన్ వారు ప్రధానమంత్రి,కేంద్ర పర్యావరణ మంత్రి కి రాసిన లేఖలను జత చేయడం జరిగినది. అటవీ శాఖ సిబ్బందికి అవార్డులను అందించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రతిపాదించిన మంత్రి కొండా సురేఖ.రాష్ట్ర స్థాయిలో అటవీ సేవా పతకాలు, వన సంరక్షణ సేవా పతకాలు, చీఫ్ మినిస్టర్ అవార్డు, జాతీయస్థాయిలో ప్రెసిడెన్షియల్ గ్యాలంట్రి అవార్డు,ఇందిర ప్రియదర్శిని




వృక్షమిత్ర అవార్డు, ఇతర జాతీయ అవార్డులను అందించే దిశగా చర్యలు చేపట్టాలని సీఎంను కోరిన మంత్రి సురేఖ.అటవీ అధికారులు భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలనే లక్ష్యంతో తమ జీవితాలను పణంగా పెట్టి అడవులు, వన్యప్రాణుల సంరక్షణను చేపడుతున్నారని మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రతిపాదించారు. విధి నిర్వహణలో భాగంగా అటవీ సిబ్బంది ఎన్నో ప్రమాదాలను ఎదుర్కొంటుంటారు. వన్యప్రాణులు, స్మగ్లర్ల నుంచి వీరి ప్రాణాలకు ముప్పు పొంచి వుంటుంది. అయినప్పటికీ వీరి త్యాగాలకు, సేవలకు గుర్తింపు లభించడం లేదు. పోలీసులతో పాటు ఇతర యూనిఫామ్ ఉద్యోగులకు వారి కృషికి తగిన గుర్తింపు లభిస్తున్నది. కానీ అడవుల్లో ఎన్నో ప్రమాదకరమైన సవాళ్ళు, ఒత్తిళ్ళతో పాటు స్మగ్లర్ల బెదిరింపులను తట్టుకుని విధులు నిర్వర్తిస్తున్న అటవీ అధికారులకు ఎలాంటి గుర్తింపు లభించడం లేదు.వీరి సేవలు కేవలం ప్రస్తుత కాలానికి మాత్రమే పరిమితమైనవి కావు భవిష్యత్ తరాల మనుగడకు వీరి సేవలు అవసరం. వీరి సేవలకు ప్రజల నుంచి ఎలాంటి గుర్తింపు గానీ, ప్రశంసలు గానీ లభించకపోవడం శోచనీయం.ఎలాంటి సౌకర్యాలు లేని అటవీ ప్రాంతాల్లో, సాయుధులైన ఆగంతకులను కేవలం పరిమిత రక్షణ పరికరాలతో, వారి ధైర్యసాహసాలతో మాత్రమే ఎదుర్కొంటున్నారని మంత్రి సురేఖ ఇందులో పేర్కొన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పోలీసులకు రాష్ట్రస్థాయి లో పోలీస్ సేవా పతకాలు అందిస్తున్నట్లుగానే అటవీ సేవా పతకాలు అందించాలని మంత్రి సురేఖ ముఖ్యమంత్రి కి విన్నవించారు. అంతేకాకుండా అటవీ, వన్యప్రాణులు సంరక్షణలో ఉత్తమ సేవలందించే వారికి ఇంతకుపూర్వం అందించిన వన సంరక్షణ సేవా పతకాలు, తిరిగి పునరుద్ధరించాలని మంత్రి కోరారు.వీటితో పాటు అడవులు సంరక్షణ, అభివృద్ధి కోసం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు చీఫ్ మినిస్టర్ అవార్డు ను అందజేయాలని విన్నవించారు. అటవీ అధికారులకు గణతంత్ర దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవంతో పాటు ప్రతి సంవత్సరం జనవరి 1 వంటి ప్రత్యేక రోజుల్లో ప్రెసిడెన్షియల్ గ్యాలంట్రి అవార్డు, ఇందిర ప్రియదర్శిని వృక్షమిత్ర అవార్డు, ఇతర జాతీయ అవార్డులను అందించే దిశగా కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని మంత్రి సురేఖ కోరారు. ఈ అవార్డులు వారిలో ఎంతో ఉత్సాహాన్ని నింపి, గొప్ప అంకితభావంతో విధి నిర్వహణ చేపట్టేలా ప్రోత్సహాన్నందిస్తాయని మంత్రి సురేఖ ముఖ్యమంత్రి కి స్పష్టం చేశారు.

## అక్షరాభ్యాసం వేడుకల్లో ఐపిఎస్ ట్రైనీ అధికారులు

**చింతపల్లి, అక్టోబర్ 23 ( నినాదం న్యూస్)** మండలంలోని జర్పుల తండా లో ఉన్న అంగన్వాడి కేంద్రంలో బుధవారం జరిగిన అక్షరాభ్యాసం, సీమంతం వేడుకల్లో ట్రైనీ ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రైనీ అధికారులు ఎంత ఉత్సాహంగా చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. సీమంతం వేడుకల్లో పాల్గొని గర్భిణీ స్త్రీలను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో ఐపీఎస్ , ఐఎఫ్ ఓ ఎస్, ఐడిఈఎస్, ఐఈఎస్,ట్రైనీ అధికారులు సుమన్ నాలా, డి. కుడియారసు, దిగ్విజయ్ సింగ్, నివేదన్, పూర్ణిమ సుడెన్, ఎంపీడీవో సుజాత, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుగుణ, పార్వతి, అంగన్వాడి ఉపాధ్యాయులు జయమ్మ, సరిత, పద్మ, గ్రామ కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.



## త్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల సమావేశాన్ని బహిష్కరించిన రైతులు

### తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

### భూసేకరణకు ఒప్పుకోం... త్రిపుల్ ఆర్ అల్కైన్మెంట్ మార్చాలని డిమాండ్

**చౌటుప్పల్,అక్టోబరు 23(నినాదంన్యూస్):** త్రిపుల్ ఆర్ 3జి నోటిఫికేషన్ భూ నిర్వాసితుల సమావేశాన్ని రైతులు బహిష్కరించి చౌటుప్పల్ మండల కేంద్రంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ భూసేకరణకు తాము ఒప్పుకోమని, త్రిపుల్ ఆర్ అల్కైన్మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. నార్త్ సైడ్ త్రిపుల్ ఆర్ అల్కైన్మెంట్ని ఓఆర్ఆర్ నుండి 28 కిలోమీటర్లకి పరిమితం చేశారని దీనివలన చౌటుప్పల్ మున్సిపాలిటీ రెండు మూడు భాగాలుగా విడిపోతున్నవని, 40 కిలోమీటర్లకు అల్కైన్మెంట్ మార్చితే మున్సిపాలిటీ విడిపోకుండా గ్రామీణ ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయని ఆయన అన్నారు. మున్సిపాలిటీ లోని భూముల బహిరంగ మార్కెట్ వాల్యూ సుమారుగా 2-5 కోట్లు, హెచ్ఎండిఏ ప్లాట్లు గజానికి సుమారుగా 20వేలు ఉండగా, ప్రభుత్వం మాత్రం నష్టపరిహారం ఎకరాకు 20 నుంచి 30 లక్షలు, హెచ్ఎండి ప్లాట్లలో గజానికి 5-6 వేలు వరకే ఇస్తామంటున్నారని అన్నారు. గతంలో తమ భూములను నేషనల్ హైవేల కోసం, విద్యుత్ స్తంభాల కోసం , నీటి కాలువల కోసం కోల్పోయామని ఇప్పుడు ట్రిపుల్ ఆర్ వలన ఉన్న కాస్త భూమి కోల్పోతున్నామని దీనివలన రైతులు



బిచ్చగాళ్ళు అయిపోయే పరిస్థితి వచ్చిందని వాపోయారు.సౌత్ సైడు త్రిబుల్ ఆర్ అల్కైన్మెంట్ ఓఆర్ఆర్ నుండి 40 కిలోమీటర్లకు చేస్తున్నట్లుగా నార్త్ సైడ్ అల్కైన్మెంట్ని కూడా శాస్త్రీయబద్ధంగా 40 కిలోమీటర్లకు మార్చాలని లేదా బహిరంగ మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం ఇస్తూ జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పెద్దిటి బుచ్చిరెడ్డి, బిజెపి మండల నాయకులు గుజ్జుల సురేందర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు బూరుగు కృష్ణారెడ్డి భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

# వీరభద్ర స్వామికి మొక్కులు చెల్లించిన కిసాన్ పరివార్ సంస్థ సీఈఓ





**డోర్నకల్ /కురవి అక్టోబర్ 23(నినాదం న్యూస్ )** మహబూబాద్ జిల్లా కురవి మండల కేంద్రం లోని కురవి వీరభద్రస్వామి ని కుటుంబ సమేతంగా దర్శించుకున్న కిసాన్ పరివార్ సీఈవో డాక్టర్ పల్లవి వివేక్ ప్రత్యేక మొక్కులు చెల్లించుకొని తెలంగాణ,మహబూబాబాద్ జిల్లా ప్రజలందరికీ ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.సమస్త ప్రజలందరు ఎల్లప్పుడు ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో ఉండాలని ఆ దేవుడిని కోరుకున్నారు.కురవి వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి కావాల్సిన సహకారం ఆలయ ఈఓ తో మాట్లాడి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో కిసాన్ పరివార్ కురవి మండల కోఆర్డినేటర్ గుగులోతు శివ వర్మ నాయక్,లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు భీమా నాయక్,సిరోల్ మండల కోఆర్డినేటర్ విష్ణు నాయక్,మరిపెడ కోఆర్డినేటర్ ఏడేళ్ళి వెంకన్న, వెంకటేశ్వర్లు,డోర్నకల్ మండల కోఆర్డినేటర్, రామ్మూర్తి,గొడుగు శ్రీనివాస్,రంగన్న గౌడ్ ఇంకా తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి.

### జిల్లాలో నవంబర్ నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం.
### భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 నినాదం న్యూస్ ):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఐడిఓసి కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో 2024-25 వరి ధాన్యం కొనుగోలుపై జిల్లా పౌర సరఫరాల సంస్థ, శాఖ ఆధ్వర్యంలో మార్కెటింగ్, సహకార, డిఆర్డీఓ, వ్యవసాయ, తూనికలు, కొలతలు శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. సన్న మరియు దొడ్డు రకం ధాన్యాలను సకాలంలో, వేరువేరు కౌంటర్ల ద్వారా కొనుగోలు చేయడానికి కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలనీ, రకాలను గుర్తు పట్టేందుకు స్పష్టమైన మార్కింగ్ చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ మొదటి వారం నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున, ముందస్తు చర్యలతో పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పర్యవేక్షణను మండల, జిల్లా అధికారులు పర్యవేక్షణకు నియమించనున్నట్లు తెలిపారు. రవాణాకు ఓపిఎంఎస్ ఎలాంటి తప్పులు లేకుండా నమోదులు చేయాలని పేర్కొన్నారు. సన్న, దొడ్డు రకం ధాన్యం గుర్తించడానికి వీలుగా పరికరాలు ద్వారా పరిశీలన చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు నూతనంగా అందుబాటులోకి తెచ్చిన సాఫ్ట్ వేర్ ను డౌన్లోడ్ చేసుకోవాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు ట్యాగింగ్ చేసిన మిల్లులకు రవాణా చేయాలని ఆయన ఆదేశించారు. అకాల వర్షాలు వస్తే ధాన్యం తడవకుండా ఎత్తైన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. సన్న, దొడ్డు రకాలు గుర్తించడం, కొనుగోళ్లలో పాటించాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలకు అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, పౌర సరఫరాల సంస్థ డిఎం రాములు, మార్కెటింగ్ అధికారి కనుక శేఖర్, డి ఆర్ డి ఓ అవినాష్, సహకార అధికారి వాలియా నాయక్, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, తూనికల కొలతలు శాఖ అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలు మరువలేనివి.

### రక్తదానం ప్రాణదానం, రక్తదానం పై అపోహలు వద్దు.: అడిషనల్ ఎస్పీ: ఆర్ ప్రభాకరరావు



**ఆసిఫాబాద్ అక్టోబర్ 24(నినాదం న్యూస్ )** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అమరవీరుల త్యాగలను స్మరిస్తూ, అసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల సాయంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా అడిషనల్ఎస్పీప్రభాకర రావు ప్రారంభించారు.
ఈ రక్తదాన కార్యక్రమంలో పోలీసులతో పాటు యువకులు మొత్తం 51 యూనిట్లు రక్తదానం చేయడం జరిగిందని అడిషనల్ఎస్పీ తెలిపారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరిని అభినందించారు. ఈ సందర్భంగా అడిషనల్ఎస్పీ గారు మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అమరులైన పోలీస్ అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ.. వారి కుటుంబాలకు పోలీస్ శాఖ తరుపున ప్రగాఢ సంతాపన్ని ప్రకటించారు. పోలీస్ అమరవీరులు సమాజం కోసం, దేశం కోసం, రేపటి తరాల మంచి భవిష్యత్తు కోసం సంఘవిద్రోహశక్తులచే పోరాడి ప్రాణత్యాగాలు చేశారన్నారు. వారి త్యాగాలను వెలకట్టలేనివని కొనియాడారు.
అదేవిధంగా థలసేమియా, క్యాన్సర్, మెడికల్ ఎమర్జెన్సీ పేషంట్లు, బ్లడ్ కేన్సర్ రోగులు, హిమోఫీలియా, ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి, తదితర జబ్బులతో బాధపడుతున్న వారి కోసం ఎక్కువగా రక్తం అవసరం ఉంటుందని అలాంటి వారికోసం మీరు ఇచ్చిన ఈ రక్తాన్ని ఉపయోగించడం జరుగుతుందని అడిషనల్ ఎస్పీ గారు తెలియజేశారు. రక్తదానం మహాదానమని, రక్తదానంపై అపోహలు వద్దన్నారు. అనంతరం రక్తదానం చేసిన పోలీసులను, యువకులను, విద్యార్థులను అడిషనల్ ఎస్పీ గారు అభినందించి ఫ్రూట్స్ మరియు బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సహకరించిన పోలీస్ సిబ్బంది మరియు ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.
ఈ రక్తదాన కార్యక్రమంలో కాగజ్నగర్ డిఎస్పి రామానుజం , ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, పోలీస్ సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు

## పోలీస్ శాఖ పై విద్యార్థులకు అవగాహన



**చింతపల్లి ,అక్టోబర్ 23 ( నినాదం న్యూస్)** పోలీస్ శాఖ పనితీరు పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడానికి బుధవారం స్థానిక హై స్కూల్ విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై భీమనమోని యాదయ్య మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లో ఉన్న రిసెప్షన్ కౌంటర్ నుంచి జిల్లా శాఖ కు సంబంధించిన వివరాలపై విద్యార్థులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. విద్యార్థులతో సెట్ లో మాట్లాడించారు. 100 నెంబర్ కు ఫోన్ చేయడం పట్ల విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో మెలిగినట్లయితే ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చని ఆయన సూచించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు రామావత్ లక్ష్మీ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులకు క్రమశిక్షణ పట్ల, పోలీస్ స్టేషన్ పట్ల అవగాహన కల్పించిన ఎస్ఐ యాదయ్య కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు డి .సుందరయ్య ,వి .వెంకటయ్య, ఎల్. వినోద్, కే. కృష్ణ ,పి. రవి, హెడ్ కానిస్టేబుల్ సైదయ్య, సునీత , తదితరులు పాల్గొన్నారు

## నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం: ప్రిన్సిపల్ వెంకటేశులు

**విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి**

**సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఆదర్శంగా నిలబడాలి**

**ఘనంగా లైఫ్ సైన్స్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు**



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 (నినాదం న్యూస్) :** నాణ్యమైన విద్యను అందించడమే తమ కళాశాల లక్ష్యమని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ డా.వి. వెంకటేషులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో లైఫ్ సైన్స్ విద్యార్థుల ఫ్రెషర్స్ అండ్ ఫేర్వెల్ వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడు తూ. విద్యార్థులు విద్యార్థి దశ నుండి విద్యార్థులు తమ లక్ష్యాలను ఎంచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులు సమయం వృధా చేయకుండా తమ కలలను సాకారం చేసుకోవాలని తెలిపారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.అనంతరం జ్యోతి ప్రజల్వాన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు పూలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు . విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి.ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు శాస్త్రి ,జువాలజీ అధ్యాపకురాలు శ్రీమతి కవిత, నళిని ,రజిత, సృజన, సతీష్, ఉపేందర్, రామారావు, నరేష్, బుక్క ఉపేందర్ , విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్యదర్శులు అసోసియేషన్ మండల అధ్యక్షులుగా అంబేద్కర్.



**తుంగతుర్తి,అక్టోబర్23(నినాదం న్యూస్):**తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నాగారం మండల పంచాయితీ కార్యదర్శుల అసోసియేషన్ ను బుధవారం ఎన్నుకున్నారు.కార్యదర్శుల అసోసియేషన్ మండల అధ్యక్షులుగా జే.అంబేద్కర్ ప్రధాన కార్యదర్శిగా సంతోష్, కోశాధికారిగా వెంకటేష్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా చంద్రశేఖర్,అరుణ్,సతీష్ యాదవ్,శోభన్ బాబు,గోపి,సురేష్, భవాని,శివకుమార్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నీ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఐకేపీ కొనుగోలు కేంద్రం ప్రారంభం



**నూతనకల్ అక్టోబర్ 23నినాదం న్యూస్:** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మండల కేంద్రంలోని బుధవారం ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని అమ్ముకొని మద్దతు ధర పొందాలన్నారు. సన్నవడ్ల కు 500 రూపాయల బోనస్ చెల్లిస్తుందన్నారు. ఈనాటి కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ నాగం జయసుధ, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి ,ఎంపీడీవో సునీత,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి, ఏపీఎం రమణాకర్,పన్నాల రమమల్లారెడ్డి, సజ్జన్ నాయక్, అశోక్ యాదవ్, నాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం ఎర్రజెండాకే సాధ్యం



**నూతనకల్ అక్టోబర్ 23 నినాదం న్యూస్ ):** కమ్యూనిస్టులు ఎక్కడ బలపడితే కార్మిక వర్గానికి అక్కడ మేలు జరుగుతుందని పేదోడి ఆకలి కేకలు ఉన్నంత వరకు నిరంతరం పోరాటం కార్మికుల పక్షాన ఎర్రజెండా ఎగురుతూనే ఉంటుందని... సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పోలిశెట్టి యాదగిరిరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కామ్రేడ్ తొట్ల మల్సుర్ స్మారక భవనంలో బొజ్జ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సిపిఐ (ఎం) 8 వ మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెట్టుబడి దారి సామ్రాజ్యం, సామ్రాజ్యవాదం, ఆర్థిక, సంక్షోభంతో కార్మికులు పడుతున్న ఇబ్బందులను ఎదుర్కోవడానికి మార్క్సిస్టు పార్టీ ముందుంటుందన్నారు. కమ్యూనిస్టులు బలపడితే దేశానికి రక్షణ, దేశ సమైక్యతకు, సమగ్రతకు అవసరమని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. ఈనాటి కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టపల్లి సైదులు, ఏకలక్ష్మి, గోపి, జిల్లా నాయకులు సత్యం, ఆ పార్టీ మండల కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి, జానయ్య, కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

## సంస్థ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలి డిప్యూటీ ఆర్ ఎం. మాధవి



**చింతపల్లి, అక్టోబర్ 23 (నినాదం న్యూస్)** టి ఎస్ ఆర్ టి సి. లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి సంస్థ అభివృద్ధికి కృషి చేసినప్పుడే గుర్తింపు ఉంటుందని డిప్యూటీ ఆర్ ఎం. మాధవి (ఆపరేషన్) అన్నారు. దేవరకొండ ఆర్టీసీ డిపోలో రాఖీ పౌర్ణమి, దసరా పండగల సందర్భంగా ప్రతిభావంతంగా విధులు నిర్వహించి రాష్ట్ర స్థాయిలో డిపోను ప్రథమ స్థానంలో నిలిపినందుకు గాను, ఆర్టీసీ ఎండి సజ్జనార్ గారి ఆదేశాల మేరకు బుధవారం డిప్యూటీ ఆర్ఎం( ఆపరేషన్) మాధవి కార్మికులందరికీ బహుమతులు ప్రధానం చేశారు. అదేవిధంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు కండక్టర్లకు, డ్రైవర్లకు, సిబ్బందికి నగదు ప్రోత్సాహకాలు అందించడం జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ రాబోయే రోజుల్లో దీపావళి పండుగ, శుభ ముహూర్తాలు ఉన్న నేపథ్యంలో ఇదే స్ఫూర్తి కొనసాగించి డిపోను ముందు ఉంచాలని సిబ్బందికి సూచిస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ తల్లాడ రమేష్ బాబు, ఎంఎఫ్ సునీత, వాహిద్, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# భువన్ అప్ ద్వారా అసెస్మెంట్ ల నమోదులో వేగం పెంచండి

### బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే
### భువన్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల నమోదు పరిశీలనపై సమీక్ష

**వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 (నినాదం న్యూస్):** భువన్ అప్ ద్వారా అసెస్మెంట్ ల నమోదులో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు.బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ బుధవారం డిప్యూటీ కమిషనర్ లతో భువన్, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల నమోదు పరిశీలనపై సమీక్షించి సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా భువన్ ఆప్ ద్వారా అసెస్మెంట్ ల నమోదు తీరు ను ఆన్లైన్ ద్వారా పరిశీలించిన కమిషనర్ అనంతరం మాట్లాడుతూ ప్రతి రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ ఐ)ప్రతిరోజు 150 దరఖాస్తులు భువన్ ఆప్ ద్వారా నమోదు చేసేలా చూడాలని, ప్రస్తుతం సుమారు 40 వేల దరఖాస్తులు నమోదు లక్ష్యం గా ఉన్నాయని నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా డిప్యూటీ కమిషనర్లు నిత్యం పర్యవేక్షించి వేగం గా చర్యలు చేపట్టాలని కమిషనర్ అన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలని, టిపిఎస్ లు, వార్డు ఆఫీసర్లు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన పరిశీలన పూర్తి చేయాలని కమిషనర్ అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, ఐటీ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# వరి ధాన్యం సేకరణ పకడ్బందీగా చేపట్టాలి...

### - అధికారులు సమన్వయంతో సక్సెస్ చేయాలి.. - కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు
### - రైతులకు ఇబ్బందులు రాకుండా ర్పాట్లు చేయాలి: - జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** వానాకాలం సీజన్ వరి ధాన్యం సేకరణ పకడ్బందీగా చేపట్టాలని, అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులనుఆదేశించారు. బుదవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వానాకాలం 2024 -25 ధాన్యం కొనుగోళ్ల పై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి హజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మద్దత్తు ధర క్వింటాల్ గ్రేడ్ %-%ఎ రకానికి రూ 2,320, సాదారణ రకానికి రూ.2, 300 సన్న రకానికి అదనంగా రూ 500 చెల్లించడం జరుగుతుందని తెలిపారు. కొనుగొలు కేంద్రాల్లో సన్న ధాన్యం, దొడ్డు ధాన్యం వేరు వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, కొనుగోలు కేంద్రంలో సన్న దాన్యం నింపే సంచులకు ఎర్ర దారంతో కుట్టి వేయాలని, "%ూ% " అనే అక్షరం ముద్రించాలని, దొడ్డు దాన్యం నింపే సంచులకు ఆకుపచ్చ దారంతో కుట్టి వేయాలని, సన్న దాన్యం దొడ్డు దాన్యం వేర్వేరు లారీలలో నింపి రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. జిల్లాలో మొత్తం 178 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అందులో 162 సన్నరకం ధన్యం కొనుగోలు కేంద్రాలు, మిగతావి దొడ్డు రకం ధన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. రెండు ఒకే కేంద్రంలో కొనుగోలు చేయడం కుదరదని అన్నారు. వరి ధాన్యం సేకరణ కేంద్రాల వద్ద త్రాగునీరు, టెంట్లను ఏర్పాటు చేయాలని అన్నారు. వరి సేకరణ



కేంద్రాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, పౌరసరఫరాల అధికారులు సమన్వయంతో సమిష్టిగా పనిచేసి వరి ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం సేకరణ కేంద్రాల్లో తేమ మిషన్లు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని, అదేవిధంగా గోనె సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉండే విధంగా చూడాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అన్ని నియమ నిబంధనలను పాటిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండ దాన్యం సేకరణ జరగాలని అన్నారు. అలాగే కొనుగోలు కేంద్రాలు ప్రభుత్వ నిర్దేశించిన ఎఫ్ఎక్యూ ప్రమాణాలను అనుసరించి కొనుగోలు చేయాలని రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో ఏమైనా అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు విషయంలో మిల్లులకు ధాన్యం తరలించే అంతవరకు ఏమైనా సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ వానాకాలం ధాన్యం కొనుగోలులో ఏవైనా సమస్యలు తలెత్తిన రైతులు ఇతరులు ఈ కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన 9347416178 నంబర్ కు ఫోన్ చేసి తెలుపాలన్నారు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో సైతం ధాన్యం సేకరణ,కొనుగోలు కు సంబంధించి ఫిర్యాదుల స్వీకరణకు రాష్ట్రస్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, రాష్ట్రస్థాయి కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1 9 6 7, 180042500333 నంబర్ కు ఫోన్ చేసి తెలుపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జ్ సంపత్ రావు, జిల్లా కోపరేటీవ్ అధికారి సర్దార్ సింగ్, డీసీఎస్ఓ షా ఫైజుల్ హుస్సేనీ, డీఎంసీఎస్ రాం పతి, ఎఫ్సిఐ డివిజనల్ మేనేజర్ ప్రకార్ వర్మ జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, ఎం వి ఐ కిషోర్ బాబు, ఎల్డి ఎం జయ ప్రకాష్, తహసీల్దార్లుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**మహాముత్తారం, అక్టోబర్ 23 (నినాదం న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించారు. బుధవారం మండలంలో పర్యటించిన ఆయన మహాముత్తారం గ్రామంలో ఇటీవల మృతి చెందిన బౌతు మల్లయ్య, మహబూబ్ పల్లి గ్రామంలో ఇనుకొండ నారాయణ రెడ్డి రేగులగూడెం గ్రామంలో మాజీ సర్పంచ్ బూసి దేవేందర్ రెడ్డీ మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. ముందుగా మృతుల చిత్రపటాలకు పూలు వేసి నివాళులు అర్పించారు. మహాముత్తారంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గజ్జెల హరీష్ ను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాటారం మండలం గారేపల్లిలో మాదారపు రమేష్, సింగనబోయిన సుందర్ లు ఇటీవల మరణించగ వారి కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఆయన వెంట స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.



# మత్స్య కారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి:తహశీల్దార్ శ్రీనివాస్



**మహాముత్తారం, అక్టోబర్ 23 (నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్య కారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఉచిత చేప పిల్లల పంపిణి చేస్తోందని మండల తహశీల్దార్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం యామన్‌పల్లి, జీలపల్లి, పోలారం గ్రామాల్లోని చెరువుల్లో ఉచిత చేప పిల్లలను ఆయన ఎంపీడీవో శ్రీనివాసరావు తో కలిసి సహకార సంఘ సభ్యులకు పంపణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టుతోందని, ఇందులో బాగంగా ఉచిత చేప పిల్లల పంపిణీతో ఉపాధి మార్గాలు మెరుగుపడుతాయని ఆయన అన్నారు. కాగా ప్రతి సంవత్సరం జూన్ జూలై మాసాల్లో పంపిణీ చేయాల్సిన చేప పిల్లల పంపిణీ చేయాల్సి ఉండగా మూడు మాసాలు ఆలస్యం చేసిందని, తాము ఇప్పటికే ప్రైవేటుగా చేప పిల్లలు కొనుగోలు చేసినట్లు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు అట్టెం రమేష్ ముదిరాజ్ తెలిపారు. ప్రభుత్వం ఇంత ఆలస్యంగా పంపిణీ చేస్తున్న చేప పిల్లలతో తమకు ఎలాంటి ప్రయోజనం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కె.రాజమౌళి, బి.స్వామీ, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా మత్స్య శాఖ అధికారులు, డైరెక్టర్ లు సమ్మయ్య, రజాకర్, వెంకట స్వామి,జె. రమేష్,మత్స్యకార సహకార సంఘ%శీ% సభ్యులు పాల్గొన్నారు.

### భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఆడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్లో

# 172 సీట్లు భర్తీకి అవగాహన సదస్సు




**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 నినాదం న్యూస్ ):** భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మజయశంకర్ భూపాలపల్లి జిల్లా ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో 24వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు అడ్మిషన్లు భర్తీపై నిర్వహించనున్న అవగాహన సదస్సు ఏర్పాట్లుపై ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఆడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్లో 172 సీట్లు భర్తీ చేయుటకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పన ధ్యేయంగా అవకాశాలున్న కోర్సులను ప్రభుత్వం అధ్యయనం చేసి ఈ సంవత్సరం నూతనంగా 6 కోర్సులను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. 10 వ తరగతి ఆపై విద్యార్హతలున్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేయుటకు అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ను భూపాలపల్లిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హత కలిగిన యువతీ, యువకులకు ఈ కోర్సులు అభ్యసించడంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని యువతీ, యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఈ కోర్సులకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఐటిఐ ప్రిన్సిపల్ జామ్లా నాయక్, డిఆర్డిఓ అవినాష్, పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, మేనేజర్ రాములు, సహకార అధికారి వాలియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 నినాదం న్యూస్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీలో హనుమాన్ నగర్ -2 అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.తనిఖీ సమయంలో ఆయన అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీ, పిల్లల హాజరు, పిల్లలు, బాలింతలు, గర్భిణిలకు అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో పాటిస్తున్న ఆహార నాణ్యత, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ చర్యలను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలు బాలల భవిష్యత్తును నిర్మించడంలో ముఖ్య పాత్ర వహిస్తాయని అన్నారు. చిన్నారులకు క్రమం తప్పక ఎత్తు, బరువు పరీక్షలు నిర్వహించాలని, ఎత్తుకు తగిన బరువు లేని పిల్లలపై ప్రత్యేక ఫోకస్ చేయాలని, బాలామృతం అందించాలని సూచించారు.ప్రతి అంగన్ సిబ్బంది చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. అలాగే అంగన్ వాడి కేంద్రానికి వస్తున్న చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ చర్యలు పాటించాలని సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు సిబ్బంది అంగన్ వాడి కేంద్ర సమస్య లను తెలియచేశారు. కేంద్రంలో చిన్నారులకు కుర్చీలు, ఆట వస్తువులు వంటి సౌకర్యాలు కల్పిస్తామని, శాశ్వత భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫ్రీ స్కూల్ చిన్నారు లకు మెప్మా ద్వారా యూనిఫామ్స్ అందచేస్తామని తెలిపారు. క్రమం తప్పక అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేసి సేవలను పర్యవేక్షణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్ గా గడ్డం స్వరూప



కాటారం అక్టోబర్ 23 నినాదం న్యూస్ : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ గాకాటారం మండలం శంకరంపల్లి గ్రామానికి చెందిన గడ్డం స్వరూప నియమితులయ్యారు. కన్వీనర్ గా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాసరావుకి, ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్ రెడ్డికి, రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి కి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు గడ్డం సుధాకర్ కి, ఉత్తర తెలంగాణ మహిళా విభాగం కన్వీనర్ వైద్యుల రజిత రెడ్డికి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు కుంట్ల ఉప్పలయ్యకి గడ్డం స్వరూప హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసినట్లు ప్రకటన లో పేర్కొన్నారు.అలాగే 2023 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తెలంగాణ ఉద్యమ కళాకారులు వారి నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకై తమ వంతుగా ఎన్నో కళా ప్రదర్శనలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీకి అండదండగా ఉండి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడడానికి అహర్నిశలు శ్రమించి ప్రభుత్వ ఏర్పాటులో కీలక భూమిక పోషించిన తెలంగాణ ఉద్యమకారులకు సరైన ఉద్యోగ అవకాశాలు కల్పించి వారందరినీ ఆదుకోవాల్సిందిగా తెలంగాణ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తూ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ రేవంత్ రెడ్డిని అలాగే మన మంథని అభివృద్ధి ప్రదాత ఐటీ మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబుని కోరుతున్నట్లు ప్రకటించారు.

# ఘనంగా శ్రీధర వర్మ జన్మదిన వేడుకలు



**మంగపేట, అక్టోబర్ 23 ( నినాదం న్యూస్ ) :** బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా సీనియర్ నాయకులు, మంగపేట మండలం అకినేపల్లి మల్లారం గ్రామ మాజీ సర్పంచ్ వత్సవాయి శ్రీధర వర్మ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వత్సవాయి శ్రీధర వర్మ పుట్టిన రోజును పురస్కరించుకుని అకినేపల్లి మల్లారం గ్రామంలోని వత్సవాయి శ్రీధర వర్మ నివాసంలో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు వత్సవాయి శ్రీధర వర్మకు శుభాకాంక్షలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజల క్షేమాన్ని కోరుకునే, ఆపదలో ఉన్న వారికి నేనున్నా అంటూ భరోసా ఇచ్చి ఆదుకునే ఆపద్బాంధవుడు వత్సవాయి శ్రీధర వర్మ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు గుండేటి రాజుయాదవ్, చల్లగురుగుల తిరుపతి , రాజమల్ల సుకుమార్, ముప్పారాపు సందీప్, జానపట్ల విష్ణు, గుడివాడ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల ప్రజలకు అండగా కాంగ్రెస్ పాలన



**మంగపేట, అక్టోబర్ 23 ( నినాదం న్యూస్ ) :** సీయం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ పాలన అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా మంగపేట మండల అధ్యక్షులు మైల జయరాం రెడ్డి అన్నారు. మంగపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారికి మంజూరు అయిన సీఎం రిలీఫ్ ఫండ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి ) చెక్కులను బుధవారం మంగపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు టీవీ హిదహితుల్లా నివాసం వద్ద లబ్దిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా మైల జయరాం రెడ్డి మాట్లాడుతూ సీయం రిలీఫ్ ఫండ్ కింద ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ కుటుంబానికి సీయం రిలీఫ్ ఫండ్ మంజూరు అయ్యేలా చేసిన రాష్ట్ర మంత్రి సీతక్కకు, కాంగ్రెస్ పార్టీ మంగపేట మండల అధ్యక్షులు మైల జయరాం రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ జిల్లా, డివిజన్, మండల , గ్రామ స్థాయి నాయకులకు లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యాణయ్య, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పెద్ది నర్సింహారావ్, జిల్లా సెక్రటరీ తూడి భగవాన్ రెడ్డి, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, బీసీ సెల్ మండల అధ్యక్షులు ముత్తినేని ఆదినారాయణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు చాద మల్లయ్య, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు టీవీ హిదహితుల్లా , మండల సీనియర్ నాయకులు వెంగల బుచ్చిరెడ్డి, కొమరం బాలయ్య, బసారికాని హరికృష్ణ, చిన్నపల్లి రాంబాబు, పూనెం రాము, లొంకా రాజు తదితరులు పాల్గొన్నారు.

# 2వ వార్డులో సిసి రోడ్డు పనులు ప్రారంభం...



**బెల్లంపల్లి అక్టోబర్ 24 (నినాదం న్యూస్)** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని 2వ వార్డులో బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత గురువారం సిసి రోడ్డు పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు 2వ వార్డులో 2లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో బూర్ల సమ్మయ్య నివాసం నుండి మెయిన్ రోడ్ పనులు ప్రారంభించినట్లు తెలిపారు.అదేవిధంగా త్వరలోనే 2వ వార్డులోని ఇందిరమ్మ కాలనీతో పాటు పలు ఏరియాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ నేతృత్వంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని చైర్ పర్సన్ తెలిపారు.వార్డులో అస్తవ్యస్తంగా ఉన్న దారిలో సిసి రోడ్డు నిర్మాణం చేయడం పట్ల స్థానిక బస్తీవాసులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ షేక్ అఫ్సర్,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు,బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఎంమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రం ప్రారంభించిన

### యాదగిరి శేఖర్ రావు పట్టభద్రుల ఎంఎల్ సి అభ్యర్థి



**కరీంనగర్, అక్టోబర్ 24(నినాదం న్యూస్ ):** ఉమ్మడి కరీంనగర్, అదిలాబాద్, మెదక్ ,నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆధ్వర్యం లో ఉచిత ఎంమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రని ట్రస్మా మాల్యాల మండలంలో ప్రారంభించారు. అనంతరం ఎంమ్మెల్సీ ఓటు నమోదు అవగాహన సదస్సు లో పాల్గొన యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్యలు వచ్చిన పరిష్కరించడంలో ముందున్నట్లు ఆయన తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కరోనా సమయంలో నెలకు 25 కిలోల సన్నబియ్యం 2000 రూపాయలు అప్పుడున్న కేసీఆర్ ప్రభుత్వ పెద్దలను ఒప్పించి రాష్ట్రంలోని 1,82,000 మంది ప్రవేటు ఉపాధ్యాయులకు అందించేలా కృషి చేశానని అన్నారు. ఇంతే కాకుండా ప్రభుత్వం వసూలు చేస్తున్న విద్యా సెస్సు ఇప్పటి వరకే కేంద్ర ప్రభుత్వ వద్ద కోట్లాది రూపాయలు వృధాగా ఉన్నవని ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులకు 10 లక్షల బీమా కోసం, పదిలక్షల ఆరోగ్య సంరక్షణ కోసం ఆ నిధులను ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావడానికి ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయుల తరపున మాట్లాడే గళం గా ఉండడానికి తాను ముందుకు వచ్చానని అన్నారు. నిరుద్యోగులకు కూడా అనేక వాగ్దానాలు చేసిన ప్రభుత్వాలు వాటిని అమలు చేయడంలో మరిచిపోతున్నాయని పట్టభద్రుల ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే ప్రభుత్వం నుండి వాటిని వచ్చేలా ఒత్తిడి తీసుకొని వస్తానని అన్నారు. తాను ఇండిపెండెంట్ గా పోటీలో ఉన్నట్లు తనకు అన్ని విద్యార్థి సంఘాల, రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల, స్వచ్ఛంద సంస్థల మద్దతు ఉందని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవడమే కాకుండా తమకు తెలిసిన పట్టభద్రుడు కూడా ఓటర్లుగా నమోదు చేయించాలని అలాగే మీ సమస్యలపై పోరాటం చేసే మీ వెన్నంటి ఉండే యాదగిరి శేఖర్ రావుకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి నన్ను గెలిపించాలని అన్నారు జిల్లా ముఖ్యసలహాదారు బోగ రవి ప్రసాద్ , జగిత్యాల జిల్లా అధ్యక్షులు శ్రీధర్ రావు , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి . కిషన్ రావు , మండల అధ్యక్షులు పి. నగేష్ ధయానంద్,అనిల్,రాజు,సత్యం, తిరుపతి,విజయన్,సుమన్, కరస్పాండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం పై నిర్లక్ష్యం వహించద్దు..

**మంథని అక్టోబర్ 24 (నినాదం న్యూస్)** పారిశుధ్యం పై నిర్లక్ష్యం వహించరాదని ఎంపీడీవో సురేష్ అన్నారు.ముత్తారం మండలంలోని హరిపురం గ్రామంలో మంగళవారం ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ చేశారు.గ్రామంలోని శానిటైజింగ్ పనులను



గ్రామపంచాయతీని పరిశీలించారు.ప్రతి వార్డులలో పరిశుభ్రత పై నిర్లక్ష్యం వహించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు. అనంతరం జిల్లాలపల్లె ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు చేశారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చౌటుప్పల్ అక్టోబర్ 23(నినాదం న్యూస్ )చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం, అల్లాపురం, ఎనగంటి తండా, చిన్నకొండూర్, జైకేసారం గ్రామాలలో ధాన్యము కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ హరికృష్ణ, అగ్రికల్చర్ ఏడీఈ వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజులు బుధవారం ప్రారంభించారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో దాన్యం అమ్మి, ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పబ్బు రాజు గౌడ్, చౌటుప్పల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న 10 వ రోజు అయ్యప్ప స్వాములకు అన్నదానం

**కోదాడ (అనంతగిరి ),అక్టోబర్ 23 (నినాదం న్యూస్)** :తెలంగాణ శబరిమల గా పేరుగాంచిన అనంతగిరి శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి సన్నిధానంలో 8 వ రోజు బుధవారం సైతం అన్నదానం కొనసాగింది.. దాతల సహకారంతో 48 రోజులపాటు అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని దాతలు ఎవరైనా ఉంటే సహాయ సహకారాలు అందించేందుకు దేవాలయ కమిటీని సంప్రదించవలసిందిగా దేవాలయ ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు తెలిపారు. కార్యక్రమంలో పందిరి వీరయ్య, ఎర్ర సాని రవి, తిప్పిరిశెట్టి శ్రీరాములు, కరక్కాయల గూడెం వీరయ్య గురుస్వామి, సిహెచ్ రామకృష్ణ ,ఐతనబోయిన వెంకటేశ్వర్లు,, ఈదుల రాజేషు, దండు రమేష్ 400 అయ్యప్ప మాలదారులు పాల్గొన్నారు.



## పోలీసుల త్యాగాలు మరువలేనివి





- **హుజరాబాద్ ఏసిపి సిహెచ్ శ్రీనివాస్ జి.**
- **హుజురాబాద్ పోలీస్ స్టేషన్ లో అమరవీరుల వారోత్సవాలు.**
- **ఓపెన్ హౌస్‌లో విద్యార్థులకు అవగాహన**

**జమ్మికుంట, అక్టోబర్ 24 (నినాదం న్యూస్)** పౌరుల సంరక్షణ ప్రథమ కర్తవ్యం గా పోలీసులు తమ సేవలను అందిస్తూ అనేక త్యాగాలను చేస్తున్నారని వారి సేవలు మరువలేనివని హుజురాబాద్ ఏసిపి సిహెచ్ శ్రీనివాస్ జి అన్నారు. గురువారం హుజురాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు చేస్తున్న పలు సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి పౌరుడు పోలీసు గా భావించాలని ప్రజల సంరక్షణ ధ్యేయంగా పనిచేస్తున్న వారికి సహకారం అందించాలన్నారు. పోలీసులు సమాజంలో ఒక వ్యక్తిగా ఉంటూ సమాజ రక్షణ కోసం తన బాధ్యతను నిర్వర్తిస్తున్నాడని అన్నారు. ప్రతి వ్యక్తి పోలీసు విధులకు ఆటంకం కలిగించకుండా సహకరించాలని సూచించారు. మహిళల సంరక్షణ కోసం షీ టీమ్లను ఏర్పాటు చేయడం జరిగిందని ర్యాగింగ్ గాని ఇతర మహిళల సమస్యల గురించి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు వెంటనే షి టీములను సంప్రదించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గాలంటే ప్రజలకు ముఖ్యంగా విద్యార్థులకు రహదారి భద్రత నియమాలు తప్పనిసరి తెలిసి ఉండాలని అన్నారు. దానివల్ల రహదారులపై ఎలా వెళ్లాలి ఎలా వ్యవహరించాలి అనేది తెలుస్తాయని అన్నారు. పోలీసులు ప్రజల రక్షణ కోసం ఉపయోగించే తుపాకుల గురించి తెలుసుకోవాలని వాటి నిర్వాహణ ఇతర విషయాలను పిల్లలకు వివరించారు. కేసులు ఎలా పెడతారు ఎఫ్ఐఆర్ అనగానేమిటి ఇతర పోలీసు పరిభాషను విద్యార్థులకు ఆయన వివరించారు. ఎవరిపై కేసులు పెడతారు , ఎవరిని సంప్రదించాలి అనే విషయాలను ఉదాహరణలతో పిల్లలకు వివరించారు. పోలీసు చట్టాల పట్ల విద్యార్థులకు అవగాహన ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ లోని పలు తుపాకులను స్పీడు గన్, మెటల్ డిక్టేటర్, తదితరాంశాలపై ప్రదర్శన ఇచ్చారు. పట్టణంలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు విద్యార్థినీలు పోలీస్ స్టేషన్ ను సందర్శించి పోలీసుల నుండి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ టౌన్ సిఐ జి తిరుమ ల్ గౌడ్, జమ్మికుంట సిఐ వరగంటి రవి, షీ టీం సీఐ విజయలక్ష్మి, సరేలాల్ ,ఏఎస్ఐ రాజేశ్వరరావు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్‌పి కార్యకర్తల మహా సమ్మేళనాన్ని విజయవంతం చెయ్యాలి

### ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాళ్ళ నరేష్.

**జమ్మికుంట, అక్టోబర్ 24 (నినాదం న్యూస్)** నవంబర్ 3 వ తేదీన హైదరాబాద్ లో నిర్వహించబోయే ధర్మసమాజ్ పార్టీ కార్యకర్తల మహాసమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ధర్మసామాజ్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేష్ పిలుపునిచ్చారు.గురువారం జమ్మికుంట లోని అంబేద్కర్ కూడలి వద్ద మహా సమ్మేళనం కరపత్రాలు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 90 శాతం బీసీ ఎస్సీ ఎస్టీ పీడీత ప్రజల ఆత్మగౌరవం అధికారం కోసం అగ్రకుల భూస్వామ్య వ్యవస్థ పై తిరుగుబాటు చేయడానికి 2023 మార్చి 15వ తారీఖున ధర్మసమాజ్ పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. ఇప్పటికీ అనగారిన వర్గాల ప్రజలకు విద్య వైద్యం ఉపాధి భూమి ఇల్లు అనే మౌలిక అంశాలు ఎక్కడ అందడం లేదన్నారు.అణగారిన వర్గాల జీవితాలు మార్చడానికి ధర్మసమాజ్ పార్టీ అనే రాజకీయ వేదిక ఏర్పడిందని తెలిపారు.పార్టీ నిర్మాణం సమీక్ష భవిష్యత్తు కార్యాచరణ కోసం ధర్మసమాజ్ పార్టీ మహా సమ్మేళనాన్ని నిర్వహించబోతుందని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్యకర్తలు విధిగా కార్యక్రమానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు. మహా సమ్మేళనం అనంతరం భారీ సామాజిక పోరాటానికి పార్టీ సిద్ధమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అన్నారం బాబుగాజుల రవి, ధర్మ స్టూడెంట్ వింగ్ బాధ్యులు సదానందం,మండల నాయకులు సందీప్, రవి తేజ, రవి కిరణ్,అభిలాష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# అధిక వేడితో పొంచి ఉన్న ప్రమాదం

## మానవ ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం.. సింగరేణి ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదు





**మణుగూరు అక్టోబర్ 24( నినాదం న్యూస్) :** గడిచిన 10 ఏళ్లలో వాతావరణంలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రోజురోజుకీ పెరిగే కాలుష్యం ద్వారా వాతావరణం ద్వారా భూమి వేడెక్కిపోతుంది. దీని ప్రభావంతో మానవ ఆరోగ్యాలపై గణనీయమైన పరిణామాలతో విపరీతమైన వేడి మరియు తేమ యొక్క సంఘటనలు పెరుగుతున్నాయి. వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా ప్రకారం హానికరమైన పరిస్థితుల గురించి నిత్యం హెచ్చరిస్తూ వేడి నుంచి ఒత్తిడి యొక్క కీలక కొలతలను ట్రాక్ చేస్తున్నారు. ప్రతి ఏడాది వాతావరణంలో వివిధ కారణాలతో అధిక ఉష్ణోగ్రత లు నమోదవుతూ భూతాపం మండిపోతుంది. దీంతో హానికరమైన పరిస్థితులు నిత్యం వస్తున్నట్లు వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రత కారణంగా మానవుల ఆరోగ్య పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అధిక వేడి ఉష్ణోగ్రత కారణంగా గాలిలో తేమ లేకపోవడం వలన మానవుల ఉదరకోశ వ్యాధులతో బాధపడుతున్నట్లు సమాచారం. ఈ ప్రభావం కిడ్నీ గుండె సంబంధ వ్యాధులలో కూడా విపరీతంగా పెరిగిపోతున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. మణుగూరు ఏరియాలో సింగరేణి ప్రభావం వేడి వాతావరణానికి నిత్యం నాంది పలుకుతుంది. మరోపక్క పవర్ ప్లాంట్ వాయు కాలుష్యం, మరోపక్క భారజల కర్మాగారం వాయు కాలుష్యం తదితర కారణాలతో మణుగూరులో అధిక ఉష్ణోగ్రతను నమోదు అవుతున్నట్లు సమాచారం. సింగరేణి కాలరీస్ సంస్థలో ఉష్ణోగ్రతలు కొలిచే సాధనంలో గత ఏడాది అక్టోబర్ నవంబర్లో 32 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైనట్లు పేర్కొంటున్నారు. అలాగే 2024 అక్టోబర్ నెలలో 43 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు అయినట్లు సింగరేణి లో ఉన్న ఉష్ణోగ్రత సాధనం ద్వారా సమాచారం తెలుస్తుంది. గత 45 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా అధిక ఉష్ణోగ్రతలను నమోదు అవ్వటం ఈ ప్రాంతంలో ఆందోళన మొదలైనట్లు తెలుస్తుంది. వాతావరణ భవిష్య సూచికలు వేడి ఒత్తిడి సంభాషతను అంచనా వేయడానికి, వివిధ సాధనాలు సింగరేణి సంస్థ ఎప్పుడు అంచనాలు వేస్తూ ఉండడం విషయం బహిర్గతం అవుతుంది. వెట్ బెల్స్ ఉష్ణోగ్రత అనేది ఒక వస్తువు నుండి తేమ ఆవిరై నప్పుడు చల్లపరచడం సులభం. ఇది వేడిగా తెమగా ఉన్నప్పుడు మన శరీరాలు చెమటలు పట్టడం ద్వారా ఎంత బాగా చల్లబరచబడతాయో కొలుస్తుంది. ఇది ఆరోగ్యానికి హానికరం కావచ్చు లేదా ప్రాణాంతకం కావచ్చు అని తెలుస్తుంది. దీనికంతటికిని పరిశ్రమలు కాలుష్యం వాతావరణంలో కలుషితమై ఈ ప్రభావాలు చూపుతున్నట్లు పరిశీలకులు



భావిస్తున్నారు. ముఖ్యంగా మణుగూరు పట్టణంలో సింగరేణి ఉపరితల గనులు ద్వారా బొగ్గు వేడెక్కి అధిక ఉష్ణోగ్రత తో కూడిన వాయు కాలుష్యాన్ని పెంచడం మూలంగా మానవ ఆరోగ్యలపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు నిపుణుల అంచనా. మణుగూరు పట్టణానికి మూడు వైపులా కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు మరోపక్క బొగ్గు ఉపరితల గనుల భారీగా కలుషితం అవడం వలన మానవ ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మణుగూరు సింగరేణి ఏరియాలో రోజుకి ఒకరు లేక ఇద్దరు చొప్పున మరణాలు సంభవించడం జరుగుతుంది. ఇక్కడ నివసించే ప్రజల్లో ఎక్కువ శాతం శ్వాసకోశ వ్యాధులు గుండె సంబంధిత వ్యాధులు కిడ్నీ వ్యాధులతో బాధపడటం కలుషితమైన వాతావరణమేనని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. అనంతరం సాయంత్రమేళల్లో ఒక్కసారిగా వాతావరణం చల్లబడటం ఆకాశంలో రంగురంగులతో కూడిన మేఘాలు ఆవరించడం జరుగుతుంది. దీంతో ఒక్కసారిగా వాతావరణ చల్లబడుతుంది. దీని మూలంగా మానవుల శరీరాలు ఒక్కసారిగా చల్లబడటం తీవ్ర అనారోగ్యాలకి కారణం అవుతున్నట్లు స్థానిక డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. దీనికి డాక్టర్ల సలహా మేరకు అధిక వేడి నుంచి శరీరాన్ని కాపాడుకోవడం. వీలైనంత చల్లని నీటిని సేవించడం ఎండ సమయంలో ఎండ నుంచి శరీరాన్ని కాపాడుకోవడం ప్రధాని అంశాలని డాక్టర్లు వెల్లడిస్తున్నారు.

# జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం





- **పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి**
- **శాంతిభద్రతల పరిరక్షణ పోలీసుల బాధ్యత.**
- **జమ్మికుంట పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వరగంటి రవి.**

**జమ్మికుంట, అక్టోబర్ 24 (నినాదం న్యూస్)** పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా గురువారం జమ్మికుంట పోలీస్ స్టేషన్ లో రక్తదాన శిబిరం ఏర్పాటుచేసిన పట్టణ సిఐ వరగంటి రవి. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఎంతో మంది పోలీసులు అమరులయ్యారని వారందరికీ పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. శాంతిభద్రతల కోసం ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా ఎంతో మంది పోలీసులు విధి నిర్వహణలో అసువులు బాసారని వారందరిని స్మరించుకుంటూ ఈ వారోత్సవాలను నిర్వహించుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. అక్టోబర్ 21 నుండి 31 వరకు నిర్వహించే వారోత్సవాలలో భాగంగా గురువారం స్పందన బ్లడ్ బ్యాంక్ వారి సౌజన్యంతో పోలీస్ స్టేషన్లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ రక్తదాన శిబిరంలో పోలీసు సిబ్బందితో సహా పలువురు యువకులు 23 మంది వరకు రక్త దానం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అమరులైన పోలీసు కుటుంబాలను కలిసి వారికి కూడా తమ ప్రగాఢ సానుభూతి తెలుపుతామని అందులో భాగంగానే గురువారం హుజరాబాద్ ఏసీబీ కార్యాలయంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎన్ని చేసిన పోలీస్ అమరుల త్యాగాన్ని మనం మర్చిపోలేని వారికి ఎంత చేసిన తక్కువే అని పోలీసులు విధుల పట్ల అంకితభావంతో పని చేస్తారని తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవ చేసే వాడే నిజమైన పోలీసు అని సిఐ తెలిపారు. మేము ఇచ్చిన పిలుపుమేరకు రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొని రక్త దానం చేసిన విలాసాగర్ గ్రామ యువకులకు తనుగుల గ్రామ యువకులకు అందరికీ పేరుపేరునా ఆయన కృతజ్ఞత లు తెలిపారు.

### యువకులకు వలపు వల

# వేస్తున్న దంపతుల అరెస్ట్....



**బెల్లంపల్లి అక్టోబర్ 24 (నినాదం న్యూస్)** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో యువకులకు వలపు వల వేస్తు వారి వద్ద నుండి డబ్బులు వసూలు చేస్తున్న గుంటూరుకు చెందిన బొద్దిరెడ్డి మౌనిక,జమ్మికుంటకు చెందిన శనిగారపు మధుకర్ లను అరెస్టు చేసినట్లు మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి తెలిపారు.సిఐ తెలిపిన వివరాల ప్రకారం మందమర్రికి చెందిన ఓ యువకుడిని హనీ ట్రాప్ చేసిన ఈ దంపతులను గురువారం మందమర్రిలో అరెస్టు చేసి వారి వద్ద నుండి 2సెల్ ఫోన్ లు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ పేర్కొన్నారు.మందమర్రి యాపల్ ఏరియాకు చెందిన ఒక యువకుడికి గత మార్చి నెలలో ఒక గుర్తు తెలియని నెంబర్ నుండి ఫోన్ రాగా అతను లిఫ్ట్ చేశాడు.ఒక ఆడ వ్యక్తి అతనితో ఫోన్లో చనువుగా మాట్లాడగా నమ్మిన ఆ యువకుడు ఆమెతో పరిచయం పెంచుకున్నాడు.ఆ తర్వాత కొన్ని రోజులకు తన కొడుకు ఆసుపత్రిలో ఉన్నాడని మాయమాటలు చెబుతు ఆ యువతి తనకు డబ్బు అవసరం ఉందని మళ్లీ ఇస్తానని నమ్మించి ఆమె ఫోన్ పే ద్వారా పలుదపాలుగా 4వేల6వందల రూపాయలు ఆమె అకౌంట్లోకి వేయించుకుదని తెలిపారు.ఆ యువతి ఆ యువకునితో మరింత చనువు పెంచుకొడానికి తన ఫోటోలను కూడా పంపించి ఆ సంబంధాన్ని కొనసాగించిందని,బాదిత యువకుడు ఆమెను తన డబ్బులు ఇవ్వమని గట్టిగా అడిగినందుకు,ఆ యువతి అతని వ్యక్తి నెంబర్ బ్లాక్ చేయగా,అ మహిళ ప్రియుడు మందమర్రి కి చెందిన ఆ యువకుడికి ఫోన్ చేసి మళ్లీ ఆమెకు ఫోన్ చేస్తే పోలీసులకు పట్టిస్తానని,కేసులు పెట్టిస్తానని బెదిరించాడు.కేసులు పెట్టకుండా ఉండాలంటే మళ్ళీ డబ్బులు కావాలని వారు ఆ యువకుడిని డిమాండ్ చేశారు,అందుకు భయపడిన యువకుడు ఫలుదపాలుగా మళ్లీ 85వేల రూపాయల వరకు వారు చెప్పిన నెంబర్లకు ఫోన్ పే చేశాడు.అయినా కూడా ఇంకా డబ్బులు కావాలని డిమాండ్ చేయగా, తాను మోసపోయానని గ్రహించిన యువకుడు సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేశాడు.ఈ సంఘటనపై మందమర్రి పోలీస్ స్టేషన్ లో పోలీసులు కేసు నమోదు చేశారు.

రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్,మంచిర్యాల డిసిపి ఎ భాస్కర్ ల ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ పర్యవేక్షణలో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా దర్యాప్తు చేసి పోలీసుల కళ్ళుగప్పి తప్పించుకుని తిరుగుతున్న ఈ జంటను అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు.ఈ జంట చాలా మందిని మాయమాటలు చెబుతు మోసం చేశారని తెలిసిందని,కాని ఎవరుకూడ ఫిర్యాదు చేయడానికి వెనుకంజ వేశారని,ఈ విధంగా మోసపోయిన వారు ఎవరు ఉన్నా కూడా ధైర్యంగా వచ్చి సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా,పోలీస్ స్టేషన్ కి వచ్చి ఫిర్యాదు చేయాలని సిఐ సూచించారు.అయితే మౌనిక తన భర్తను వదిలి మధుకర్ తో సహజీవనం చేస్తుందని సిఐ తెలిపారు.ఈ హనీ ట్రాప్ జంటను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన మందమర్రి సిఐ,ఎస్ఐ,హెడ్ కానిస్టేబుల్ అజయ్,రాము,మహిళ హొంగార్డు ఉమ లను బెల్లంపల్లి ఎసిపి ప్రత్యేకంగా అభినందించారు.

# అమరుల యాదిలో

**- మరిపెడ లో కొవ్వొత్తులతో ర్యాలీ**

**- పోలీస్ అమర వీరులకు నివాళులు : సీఐ రాజ్ కుమార్**



**డోర్నకల్ /మరిపెడ అక్టోబర్ 23(నినాదం న్యూస్ ):** వీధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు సిబ్బంది త్యాగలను స్మరించుకుంటూ మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో పోలీస్ స్టేషన్ నుండి కార్గిల్ సెంటర్ వరకు సీఐ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతాలను కాపాడడమే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహిస్తారు.24 గంటలపాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అండగా ఉంటారు.దేశ సరిహద్దుల్లో సైనికులు దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం అర్పిస్తారు.శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు తమ ప్రాణాలను అర్పిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు సతీష్,సంతోష్,ఝాన్సీ,మరిపెడ పోలీస్ సిబ్బంది ఇంకా తదితరులు పాల్గొన్నారు...

### ఎవరు అడ్డుపడిన మూసి ప్రక్షాళన

# ఆగదు ఎమ్మెల్యే: సామేల్

- గాదరి కిషోర్ నోరు అదుపులో పెట్టుకో
- ఇసుక దందా,దొంగనోట్ల చరిత్ర నీది
- కిషోర్ కి వచ్చిన డాక్టరేట్ పై విచారణ జరపాలి
- అధికారం పోయినా అహంకారం తగ్గలేదు
- విమర్శలు చేసే స్థాయి నీకు లేదు



తుంగతుర్తి,అక్టోబర్24(నినాదం న్యూస్):సిఎం రేవంత్ రెడ్డిని,మంత్రి వెంకట్ రెడ్డిని విమర్శించే స్థాయి ఇసుక దందా చేసిన మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కు లేదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు.గురువారం హైదరాబాద్ లో ఆయన మాట్లాడుతూ మూసీ నది పరివాహక ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన గాలి నీరు అందించాలని ఒక మంచి లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుంటే ఎక్కడ తమ బీఆర్ఎస్ పార్టీ పునాదులు లేకుండా లేచిపోతాయో అని భయంతో విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు.సిఎం రేవంత్ రెడ్డి,మంత్రి వెంకట్ రెడ్డి ఉన్నతమైన స్థానంలో పుట్టిన నేతలు అని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ తొలిసారి నామినేషన్ వేసిన రోజు కనీసం ఇండికా కారు లేని నాయకునికి ఈ తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో ఇసుక,దొంగ నోట్ల దందాలు చేసి అవినీతి సొమ్మును కూడ కట్టుకున్న కిషోర్ మాట్లాడడం సిగ్గుచేటు అని అన్నారు.అధికారం పోయినా అహంకారం తగ్గలేదనీ,సిఎం రేవంత్ రెడ్డి,మంత్రి వెంకట్ రెడ్డి పై విమర్శలు చేసే స్థాయి నీకు ఉందా అని అన్నారు.ఇకనైనా అహంకారపూరితమైన మాటలను వదిలి మంచి మాటలతో గౌరవం ఇచ్చిపుచ్చుకోవాలని సూచించారు.లేనిపక్షంలో తుంగతుర్తి నియోజకవర్గం లో ప్రజలు తిరగనివ్వరని హెచ్చరించారు.సిఎం రేవంత్ రెడ్డి,మంత్రి వెంకట్ రెడ్డి పైన మరోసారి ఇష్టానుసారంగా మాట్లాడితే నాలుక కోస్తామని నీ కథలన్నీ బయటకి తీస్తే జైలుకు పోవడం ఖాయమని,గాదరి కిషోర్ కి వచ్చిన డాక్టరేట్ పైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ఎవరు అడ్డుపడిన మూసి ప్రక్షాళన ఆగదన్నారు.

## బస్సులను తనిఖీ చేసిన డి ఎం.రమేష్ బాబు



చింతపల్లి, అక్టోబర్ 24 ( నినాదం న్యూస్) మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు వద్ద దేవరకొండ డిపో మేనేజర్ గురువారం బస్సులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు ప్రయాణం ఎంతో సురక్షితంగా ఉంటుందని ప్రయాణికులతో చెప్పారు. టికెట్ లేకుండా ప్రయాణం చేయకూడదని సూచించారు. ఆర్టీసీ బస్సుల రాకపోకలు, రిజర్వేషన్లు, తదితర అంశాలపై అవగాహన పొందడానికి ఆర్టీసీ పొందుపరిచిన యాప్ లను డౌన్ లోడ్ చేసుకోవాలని కోరారు. స్థానిక బస్టాండ్ వద్ద ప్రైవేటు వాహనాలను నిలిపివేయరాదని ఆయన అన్నారు. ఆయన వెంట సి ఐ.(జనరల్) ఉపేందర్ , టి ఐ టి యు.3 దీప్లాల్, డ్రైవర్ ఇద్దయ్య తదితరులు ఉన్నారు.

## కబడ్డీ మెన్స్ టోర్నమెంట్‌కు ఎంపికైన విద్యార్థులు



సూర్యాపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 24( నినాదం న్యూస్) తమిళనాడు రాష్ట్రం ఎస్ఆర్ఎం ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఈనెల అక్టోబర్ 30 న జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పురుషుల టోర్నమెంట్ కు సూర్యాపేట పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎ. సాయి దీపక్ ఎం .సాయికుమార్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డాక్టర్ వి. వెంకటేశులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులకు జ్ఞాపికను అందజేసి అభినందించారు. టోర్నమెంట్ లో రాణించి కళాశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జి.వెంకన్న అధ్యాపకులు శాస్త్రి, శరత్, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎఈపై కౌన్సిలర్ అనుచిత వ్యాఖ్యలు..

### విధులు బహిష్కరించిన మున్సిపల్ సిబ్బంది... ఎసిపికి ఫిర్యాదు..





బెల్లంపల్లి అక్టోబర్ 24 (నినాదం న్యూస్) మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపాలిటీ 22వ వార్డు కౌన్సిలర్ గడ్డం అశోక్ గౌడ్ తనను అవమానపరిచే విధంగా చేసిన వ్యాఖ్య లను తీవ్రంగా ఖండిస్తున్నట్లుమున్సిపల్ ఎఈ సందీప్ తెలిపారు.ఎఈ పై కౌన్సిలర్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తో పాటు మున్సిపల్ అధికారులు,సిబ్బంది నల్ల బ్యాడ్జిలు ధరించి గురువారం తమ విధులు బహిష్కరించారు. అనంతరం ర్యాలీగా తరలివెళ్లి ఎసిపి ఎ రవి కుమార్ కు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు ఎసిపి తో మాట్లాడుతు ప్రభుత్వ అధికారుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తు మానసిక వేదింపులకు గురి చేస్తున్నాడని తెలిపారు.శవాలపై డబ్బులు ఏరుకుంటావని వాట్సాప్ గ్రూప్ లలో కౌన్సిలర్ అవమానపరిచే విధంగా మెసేజ్ పెట్టడంతో తీవ్ర మానసిక క్షోభకు గురైన తాను బెల్లంపల్లి ఎసిపి కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.విధి నిర్వహణలో భాగంగా తమకు ఎన్నో విధమైన రకాల పను లు ఉంటాయని అందులో భాగంగానే ఆయన తమ పనితీరును అర్థం చేసుకోకుండా మానసి కంగా వేధించే విధంగా పోస్టులు పెట్టడం సరి కాదని పేర్కొన్నారు.ఒక బాధ్యత గల పదవిలో ఉంటు ఆయన ఇష్టానుసారంగా ఒక ప్రభుత్వ అధికారి పట్ల పోస్టులు పెట్టి అవమానపరచడం సరికాదని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సి పల్ కమిషనర్ శ్రీనివాసరావు,డిఈ ప్రసాద్, టిఒ అశ్రిత్,ఆర్ఓ ప్రవీణ్,సునీల్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం కష్టపడ్డ నాయకులను గుర్తించండి.

### ఎన్ ఎస్ యు ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండేటి మహేష్.



**జమ్మికుంట, అక్టోబర్ 24(నినాదం న్యూస్):** కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించాలని పార్టీ కష్టకాలంలో జెండాలు మోసి కేసులు నమోదైన పార్టీని వీడకుండా ఇంట్లో బాధ్యతలు పట్టించుకోకుండా క్షేత్ర స్థాయిలో పనిచేసిన వారిని గుర్తించా లని ఎన్ఎస్యుఐ నేత గుండేటి మహేష్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ తన కుటుంబం అని పనిచేసిన నికార్సైన కాంగ్రెస్ కరుడుగట్టిన కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత పార్టీ నాయకత్వంపై ఉందని ఆయన అన్నారు. కార్యకర్తల కృషితో కష్టంతో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిందని గ్రామ స్థాయిలలో మండల స్థాయిలో ఇందిరమ్మ కమి టీలో వారికి ప్రాముఖ్యత ఇవ్వాలని ఆయన కోరారు సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా పాత వారికే ప్రాముఖ్యత ఇవ్వాలని టీ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చెప్పినట్టుగా కార్య కర్తలే పార్టీకి వెన్నెముక అని వెల్లడిం చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్ని కల్లో నికార్సైన కాంగ్రెస్ కార్యకర్తలను గుర్తించి వారికి అవకా శం కల్పించా లని పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వారి స్వార్థం కోసం ఎంతోమంది వస్తు పోతూ ఉంటారని అలాంటివా రిని ప్రోత్సహించకుండా పార్టీని నమ్ముకొని పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను పార్టీ అధిష్టానం గుర్తించాలని మహేష్ ఒక ప్రకటనలో కోరారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ



**మంగపేట, అక్టోబర్ 24 ( నినాదం న్యూస్ )** : ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రానికి చెందిన దాసుల శ్రీలక్ష్మి ఇటీవల మృతి చెందారు. మృతురాలి దశదిన ఖర్మ కార్యక్రమాలను కుటుంబ సభ్యులు గురువారం నిర్వహించారు. మృతురాలి కుటుంబాన్ని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య గురువారం పరామర్శించి మృతురాలి చిత్రపటం వద్ద నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య, జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) ములుగు జిల్లా ఉపాధ్యక్షులు గాదె శ్రీనివాస చారి, రాష్ట్ర కమిటీ సభ్యులు కుంట ఏడుకొం డలు, గోవిందరావుపేట మండల అధ్యక్షులు సన్నగుండ్ల వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు మలికంటి శంకర్, మంగపేట మండల నాయకులు చీకుర్తి సుధాకర్, ముంజపెల్లి సంపత్, గుండేటి రాజు యాదవ్, ముప్పారపు సందీప్, సీనియర్ తెలంగాణ ఉద్యమకారులు పప్పు వెంకటరెడ్డి, యాదండ్ల రాజయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



**చేవెళ్ల అక్టోబర్ 24 (నినాదం న్యూస్):** భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరు భాగస్వాములు అవ్వాలని చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడు గౌండ్ల కృష్ణ గౌడ్ అన్నారు. గురువారం చేవెళ్ల మండల ఉపాధ్యక్షులు గౌండ్ల కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో మల్కాపూర్ గ్రామంలో ఇంటింటికి తిరిగి సభ్యత్వం నమోదుకార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, దేశ రక్షణ కోసం బీజేపీ తోనే సాధ్యం అన్నారు. మోడీ హయాంలో దేశం సురక్షితంగా సుభిక్షంగా ఉందని, దేశం అభివృద్ధి మోడీ తోనే సాధ్యమని అన్నారు. ప్రతిఒక్కరు బీజేపీ లో చేరి దేశ అభివృధిలో భాగస్వాములు అవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అంజనేయులు గౌడ్, సీనియర్ నాయకులు శర్వా లింగం,ఇంద్రసేనారెడ్డి పెద్దోళ్ల కృష్ణ , మాణిక్యం వెంకటేష్ గారు, మాల్కాపూర్ గ్రామ భూత్ అధ్యక్షులు శ్రీకాంత్, మల్లేష్, సీనియర్ నాయకులు శివకుమార్ గారు పాల్గొనడం జరిగింది.

# సేవా దృక్పథం కలిగి ఉండడం తప్పా...



కొల్చారం, అక్టోబర్ 24( నినాదం న్యూస్)
పరువు తీస్తున్నారంటూ ఓ యువకుడు విలేకరులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన గురువారం కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మండలంలోని సంగాయపేట గ్రామానికి చెందిన మన్నే సాయి చరణ్ అనే యువకుడు వార్తాపత్రిక, యూట్యూబ్ ఛానల్ లలో తనపై అసత్య కథనాలు రాస్తూ పరువు తీసే ప్రయత్నం చేస్తున్నారని ఇద్దరు విలేకరులపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను సైబర్ నేరాలకు పాల్పడుతున్నానని, అధికారులకు బంగారంతో పాటు కొంత మొత్తం నగదు రూపాయలు లంచం ఇచ్చానని తప్పుడు ఆరోపణలతో కథనాలు రాసిన విలేకరులపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అనంతరం సాయిచరణ్ విలేకరులతో మాట్లాడారు.

తనను బ్లాక్ మెయిల్ చేసే ప్రయత్నం
తన సేవా కార్యక్రమాలు చూసి ఓర్చుకోలేని కొందరు అసత్య ఆరోపణలతో తనను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు కాజేయాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. తనకు వైన్సులు, రెస్టారెంట్, కంపెనీ ఉన్నాయని వాటి ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని పేద ప్రజలకు సహాయం చేస్తున్నానన్నారు. తాను సక్రమంగా యేడాదికి 5 లక్షల 80 వేలు ఇన్కమ్ టాక్స్ చెల్లిస్తున్నానన్నారు. తనపై అసత్య ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు.

ఎదుగుదల ఓర్వలేకనే కుట్రలు
సేవా దృక్పథంతో తాను దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సమయంలో మండలంలోని వివిధ దుర్గా మంటపాలకు విరాళాలు ఇచ్చాననీ, పలు బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం చేశానని, ఇటీవల రంగంపేటలో శివాజీ విగ్రహ ఏర్పాటుకు తన వంతు ఆర్థిక సహాయం అందజేశానన్నారు. తాను చిన్ననాటి నుండి కుటుంబ, ఆర్థిక ఇబ్బందులతో కష్టాలు చూసి ఎదిగానన్నారు. తనలాగా కష్టాలలో ఉన్న కుటుంబాలను ఆదుకోవాలని తన కష్టంలో కొంత భాగం దానం చేస్తూ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, పుణ్యకార్యాలు చేస్తున్నానన్నారు. తన ఎదుగుదల ఓర్వలేకనే కొందరు పరోక్షంగా కుట్రలు చేస్తున్నారని అనుమానంగా ఉందన్నారు.

రాజకీయాపేక్ష లేదు
తనకు ఎటువంటి రాజకీయ అపేక్ష లేదని, తన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకు, రాజకీయాలకు లింకు పెట్టవద్దని కోరారు. తన సంపాదనలో సుమారు 80 శాతం దానం చేయాలని మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు చేస్తున్నానన్నారు.

స్వచ్ఛంద సేవకు మోకాలు అడ్డు వద్దు
తాను చేస్తున్న స్వచ్ఛంద సేవకు సహకరించాలన్నారు. వీలైతే తనతోపాటు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో కలిసి నడవాలని కోరారు. మనసుంటే పేద ప్రజలకు సేవ చేయాలి కానీ, చేసేవారిని అడ్డుకోకూడదని హితవు పలికారు.

గ్రామస్తులు సైతం విలేకరిపై కేసులు
మండల పరిధిలోని రంగంపేట గ్రామస్తులు సైతం గ్రామానికి చెందిన ఓ విలేఖరి పై కేసు పెట్టారు. మన్నే సాయి చరణ్ పెద్ద మనసుతో తమ గ్రామంలో శివాజీ విగ్రహానికి ఆర్థిక సహాయం చేయగా గ్రామానికి చెందిన ఓ విలేఖరి తప్పుడు కథనాలతో హేయ్ నాను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నాడు అన్నారు. దీనితో దాత సాయిచరణ్ విరాళం ఉపసంహరించుకుంటే తమకు నష్టం జరుగుతుందని, ప్రశాంతంగా ఉన్న గ్రామంలో సదరు విలేఖరి తప్పుడు కథనాలతో అశాంతియుత పరిణామాలు చోటు చేసుకునే ప్రమాదం పొంచి ఉందన్నారు. వెంటనే సదరు విలేఖరి పై తగు చర్యలు తీసుకొని పరిస్థితి చక్క పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మన్నే సాయిచరణ్ తో పాటు ఆయా గ్రామాల యువజన సంఘాల సభ్యులు, రంగంపేట గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### గోల్డెన్ బారెల్ బార్, పబ్ ప్రారంభోత్సవానికి

# మేయర్ డిప్యూటీ మేయర్‌లకు ఆహ్వానం





కుత్బుల్లాపూర్, ఫైల్ నెంబర్ 5 (నినాదం న్యూస్):
**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 24 (నినాదం న్యూస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి టీవీఎస్ షోరూం వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న గోల్డెన్ బారెల్ బార్, పబ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరుకావాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ లను గోపి చౌదరి మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. అక్టోబర్ 25 శుక్రవారం బాచుపల్లి టీవీఎస్ షోరూం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన గోల్డెన్ బారెల్ బార్ %డ% పబ్ ప్రారంభోత్సవనికి ముఖ్య అతిథులుగా రావాలని ఆహ్వానించారు.

# కొలన్ హన్మంత్ రెడ్డి చొరవతో రోడ్డు నిర్మాణానికి 28 లక్షల మంజూరు

## పనులు ప్రారంభించిన కొలను హనుమంత రెడ్డి

















**కుత్బుల్లాపూర్, ఫైల్ నెంబర్ 6 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్, అక్టోబర్ 24 (నినాదం న్యూస్) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ 128 డివిజన్ లోని పట్వారీ నగర్ (చర్చి రోడ్డు) ,రంగా నగర్ స్ట్రీట్ నెం: 6,9 లో సీసీ రోడ్ పూర్తిగా పాడైపోవడంతో బస్తి వాసులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. బస్తి వాసులు నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని గత నెల సంప్రదించగా వారి సమ్యసపై స్పందించి ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు స్పెషల్ ఫండ్స్ ద్వారా సిసి రోడ్ నిర్మాణానికి 28 లక్షలు మంజూరు చేయించి ఆయన ప్రారంభించారు. తమ ప్రాంతంలో సిసి రోడ్డు నిర్మాణానికి కావలసిన నిధులు మంజూరు చేయించేందుకు కృతజ్ఞతలు తెలుపుతూ బస్తి వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎన్. నాగరాజు(%×త్బఎ% నేషనల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ), పండారావు, జేమ్స్,అనంత రావు,షేక్ లాల్ మిస్టరీ,అనిల్ రెడ్డి, ఆంజనేయులు, మధు.జి,శ్రీనాథ్,సుభా రావు,జి.సాయి,శివ లల్లా,బల్ల చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# మాలల ఆత్మీయ సభను విజయవంతం చేయండి

**చేవెళ్ల అక్టోబర్ 24(నినాదం న్యూస్):** 27 వ తేదీన నాగర్ కర్నూల్ లో జరగబోయే మాలల ఆత్మీయ సమ్మేళనం సభను విజయవంతం చేయాలని సమతా సైనిక దళ్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలోని దుద్దాగు కమ్మెట గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాలల ఆత్మీయ గౌరవ సభ కరపత్రాలను విడుదల చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 27 న నాగర్ కర్నూల్ లో జరగబోయే మాలల ఆత్మీయ సమ్మేళన సభ కు మాలలు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏర్పుల మల్లేష్, చేవెళ్ల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు సున్నం ప్రవీణ్ సమతా సైనిక్ దళ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మాచనపల్లి రామస్వామి చేవెళ్ల మండల సభ ఇన్చార్జి విజయ్ కుమార్ ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం చేవెళ్ల మండల అధ్యక్షుడు మల్లెపల్లి శ్రీనివాస్ సమత సైనిక్ దళ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మాచనపల్లి రామచందర్, అంబేద్కర్ యూత్ ప్రెసిడెంట్ గూడెం నవీన్. గూడెం గోపాల్ డీలర్, బిఆర్ఎస్వి రాష్ట్ర సెక్రెటరీ కోనపురం శిష్య పాల్ గూడెం జైపాల్ కోనాపురం ప్రవీణ్ క దుంపల నవీన్ గూడెం వినయ్ ఎండ్. నజీమ్ చిట్టంపల్లి మాజీ సర్పంచ్ రాజు అంబేద్కర్ సంఘం అధ్యక్షులు బి శివ, గోపాల్, సంజీవ, ప్రసాద్,విష్ణు, వెంకటేష్,పాల్గొన్నారు.



